లోపలి పేజీలలో...



# తొలకరి

## సుస్థిర వ్యవసాయ మాస పత్రిక


సంపుటి: 5 సంచిక: 3 హైదరాబాద్ ఆగస్టు 2016 పేజీలు: 40 వెల: రూ. 20/-







ఆంధ్రప్రదేశ్‌లో 271 జీ.వో.

తెలంగాణాలో 123 జీ.వో.







చట్టాలను తుంగలో తొక్కుతూ, జీ.వో.లు జారీ చేస్తూ ప్రభుత్వాలు గ్రామీణ ప్రజలను సంక్షోభంలోకి నెడుతున్నాయి.



సేంద్రియ వ్యవసాయ శిక్షణ





గ్రీన్ దునియా ఫామ్స్

# రైతు సహకార సంఘాల భాగస్వామ్యంతో పురోగమిస్తున్న 'సహజ ఆహారం ప్రొడ్యూసర్ కంపెనీ'

## Certificate

**HYM International Certifications Pvt. Ltd.**

Certified that the Quality Management System of

**SAHAJA AHARAM PRODUCER COMPANY LIMITED**

12-13-445, 1st Floor, Street No.1, Tarnaka, Secunderabad - 500 117

has been assessed and found to be in accordance with the requirements of the quality standards

**ISO 9001:2015**

for the following scope of certification

PRODUCTION, MANUFACTURING, PROCESSING AND RETAIL TRADE OF FOOD PRODUCTS, AGRICULTURE IMPLEMENTS

Further information about the scope of this certificate and applicability of ISO 9001 : 2015 requirements may be obtained by consulting the organization.

| | | |
|---|---|---|
| *Issued Certificate Date* | : | *16/07/2016* |
| *First Surveillance Due on* | : | *15/07/2017* |
| *Second Surveillance Due on* | : | *15/07/2018* |
| *Certificate Renewal Date* | : | *15/07/2019* |

**Surveillance Audit**

Due on 15/07/2017

Due on 15/07/2018

HYM

QMS

ASCB(E) Accrediting Certifying Bodies

Certificate No. : Q9186414570

Authorised signature
For HYM International Certifications Pvt. Ltd.

This is an accredited certificate authorized for issue by Accreditation Service for Certifying Bodies [Europe] Limited who have assessed M/s.HYM International Certifications Pvt. Ltd. against defined criteria and in cognisance of ISO 17021:2015 "Conformity Assessment - Requirements for bodies providing audit and Certification of management Systems". This Certificate is valid only when confirmed by the register listed in the International Register of Quality Assessed Organizations: www.irqao.com

Regd. Office : Plot No. 265/C, Addagutta Society, Opp. JNTU, Kukatpally, Hyderabad - 500 072. TS, India.
E-mail : hymcertifications@gmail.com, Website : www.hymcertifications.com

---

**Scope Certificate**

Certificate No. ORG/SC/1310/001394

SAHAJA AHARAM
ENABAVI VILLAGE, MANIKYAPURAM Gram Panchayat,
Warangal, Telangana-506201

ADITI
Accreditation No. under NPOP
NPOP/NAB/0017

This is to certify that the product(s) and area(s) of the mentioned organisation inspected by Aditi Organic Certifications Pvt. Ltd are in accordance with requirements of

**India's National Programme for Organic Production Standards**

(Considered equivalent to Council regulation (EC)No. 834/2007(Category A & F) and Swiss Organic Farming Ordinance for unprocessed plant products originating in India)

For the following process,
Production
this Certificate is issued.

This certificate is valid from
27/06/2016 until 11/04/2017

This certificate is valid for those product(s) and area(s) that are specified in the annexe ORG/SC/1310/001394 A.

The validity of this certificate solely depends on the continued compliance with the required standards and is subject to annual surveillance inspections.

Authorised By:
Ms. Sunita Rabindranathan
Assistant Certifier
Issued Date: 07/07/2016


(253) 8508001112017072016001558











ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో సి.ఎస్.ఎ. సహకారంతో రైతులు సహకార సంఘాలను నిర్మించుకున్నారు.

ఈ సహకార సంఘాల భాగస్వామ్యంతో సహజ ఆహారం ప్రొడ్యూసర్ కంపెనీని ఏర్పర్చుకున్నారు.

సహజ ఆహారం బ్రాండ్‌తో సేంద్రియ, సహజ, పురుగు విషాలు వాడని ఉత్పత్తులను నేరుగా వినియోగదారుల ముందుకు తీసుకువస్తున్నారు.
ముడి ఉత్పత్తులను అమ్మడమే కాకుండా ప్రాసెసింగ్‌లోకి ప్రవేశించి వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నారు.
రెండు రాష్ట్రాలలోనూ సహజ ఆహారం అమ్మే ఫ్రాంచైజ్ స్టోర్‌లను ఏర్పరుస్తున్నారు.
ఇప్పటికే హైదరాబాద్, విశాఖపట్నం, అనకాపల్లి, ఖమ్మం నగరాలలో ఈ రకమైన స్టోర్‌లు ప్రారంభమయ్యాయి.

# తొలకరి

ఆగస్టు 2016

సంపుటి : 5 సంచిక : 3

వెల 20/-



సంపాదకులు
డా॥ జి.వి.రామాంజనేయులు

సహ సంపాదకులు
కన్నెగంటి రవి
ఫోన్: 9912928422
ravi@csa-india.org

సంపాదక వర్గం
డా॥ టి.ఎ.వి.ఎస్. రఘునాథ్
జి. చంద్రశేఖర్
డా॥ జి. రాజశేఖర్



పబ్లిషర్ & ప్రింటర్
ఎం. లీలా ప్రసాద్

ముద్రణ
నవ్య ప్రింటర్స్, హైదరాబాద్.



వివరాలకు
ఎడిటర్, తొలకరి
12-13-445, వీధి నెం. 1,
తార్నాక, సికింద్రాబాద్ - 500 017
ఫోన్: 040-27014302 / 7735
www.tolakari.com


## లోపలి పేజీల్లో



'మట్టి అద్భుత పదార్థం
ఆకుపచ్చని లోకాన్ని తనలో నుంచి
ఆవిష్కరించింది మట్టి'
'బతుకును బతికించే
నిలబెట్టే కదిలించే
కీలక మూలకం మట్టే'

'ప్రపంచమంతా మట్టిమీదే
కాదంటే మట్టి మనిషిమీదే నిలబడేది'
'మట్టిని నమ్ముకున్న బతుకు
మట్టిలోనే పాలి అయినప్పుడు
అది తప్పకుండా హత్యే
చేసిందెవరనే నేను ప్రశ్నిస్తాను'

# రక్తమోడుతున్న గాయం...

'మల్లన్న సాగర్ రిజర్వాయర్ నిర్మాణం అవసరమే లేదంటూ' నీటి పారుదల రంగ నిపుణులు ఘోషిస్తున్నా, 'మల్లన్న సాగర్ వద్దు – మా గ్రామమే ముద్దు' నినాదంతో ముంపు గ్రామాల ప్రజలు ఉద్యమిస్తున్నా, ప్రభుత్వం మూర్ఖంగా ముందుకే వెళ్ళేందుకు ప్రయత్నిస్తోంది. ప్రాజెక్టులు, అభివృద్ధి పేరుతో పాలకులు సాగిస్తున్న అక్రమ భూసేకరణ, ఈగ్రామాల ప్రజలనే కాదు, రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లాలలోనూ గ్రామీణ వ్యవసాయదారులలో భరోసా కల్పించకపోగా, గుబులునే రేకెత్తిస్తోంది. ఉద్యమాలతో తెలంగాణా రాష్ట్రాన్ని సాధించుకున్న తెలంగాణా ప్రజల గొంతు వినేందుకు ప్రభుత్వం ఏ మాత్రమూ సిద్ధంగా లేదనీ, ముంపు గ్రామాల ప్రజలపై సాగించిన దారుణ దమనకాండ, మహిళలు, వృద్ధులు, పిల్లలతో సహా రక్తమోడేలా పోలీసులు సాగించిన లాఠీఛార్జీని చూస్తే స్పష్టమై పోతుంది.

2013 భూ సేకరణ చట్టాన్ని ప్రక్కన బెట్టి, జీ.వో. 123 పేరుతో భూములను కబ్జా చేసేందుకు ప్రభుత్వం రకరకాల బెదిరింపులకు దిగుతోంది. బ్లాక్ మెయిల్ చేస్తోంది. ఇందుకోసం సాదా బైనామా భూమి రికార్డులను వాడుకుంటోంది. గ్రామాలలో కొంత మందిని లొంగతీసుకుని, ప్రజలను మానసికంగా కుంగదీయాలని ప్రయత్నిస్తోంది. బ్రోకర్లకు లక్షల రూపాయలు వెదజల్లుతోంది. దొంగచాటుగా, గ్రామాల బయట బేరసారాలు సాగిస్తోంది. ప్రభుత్వానికి చెందిన ఒక్క ప్రజా ప్రతినిధిగానీ, టి.ఆర్.ఎస్. పార్టీ నాయకులు గానీ, గ్రామాలకు వెళ్ళి ప్రజలతో చర్చించే ప్రయత్నం కూడా చేయడం లేదు. మొత్తం ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా కుట్రలు, పోలీసు కవాతులు సాగిస్తున్నారు.

తెలంగాణా ప్రజలకున్న సహజ స్వభావమే అన్యాయాన్ని ప్రతిఘటించడం. మల్లన్న సాగర్ ముంపు గ్రామాల ప్రజలూ, రాష్ట్ర ప్రజలకు దిక్సూచిగా, ప్రస్తుతం అదే బాటన పయనిస్తున్నారు. గ్రామాలు ఐక్యంగా భూములివ్వబోమని తీర్మానాలు చేస్తున్నాయి. గ్రామాలన్నిటా 'దీక్షలు' కొనసాగుతూనే వున్నాయి. మహిళలు ముందు వరుసలో ఉండి ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళుతున్నారు. బ్రోకర్లను గ్రామాల నుంచి తరిమేస్తున్నారు. అధికారులను గ్రామాలలోకి అడుగు పెట్టనీయడం లేదు. ఆకలి, దప్పులను మరిచి, నిద్రాహారాలు మాని గ్రామాలను ముంపు కానివ్వబోమంటూ ప్రతిజ్ఞలు చేస్తున్నారు.

ముంపు గ్రామాల ప్రజలకు అండగా అన్ని ప్రతిపక్ష పార్టీలూ మాట్లాడుతున్నాయి. కొన్ని రాజకీయ పక్షాల వైఖరిలో 'రిజర్వాయరే వద్దనే' స్పష్టత లేక పోయినా, పాలక పక్షాన్ని ఇరుకున పెట్టి, రాజకీయ లబ్ది పొందాలనే యావ కనిపిస్తున్నా, ఆయా గ్రామాలలోని ప్రజలు ముఖ్యంగా యువకులు, మహిళలు సాగిస్తున్న పోరాటానికి ప్రజా సంఘాలు, మేధావులు, నిపుణులు మాత్రం పూర్తి స్థాయి అండదండల నందిస్తున్నారు. నీటి పారుదల రంగ నిపుణులు హనుమంతరావు, పౌరహక్కుల ఉద్యమ నాయకులు ప్రొఫెసర్ హరగోపాల్, టీజేఏసీ ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరాంతో సహా, రైతు స్వరాజ్య వేదిక, మహిళా రైతుల హక్కుల వేదిక, దళిత బహుజన ఫ్రంట్, కేరింగ్ సిటిజన్స్ కలెక్టివ్, తెలంగాణా విద్యావంతుల వేదిక, తెలంగాణా ఆత్మ గౌరవ వేదిక లాంటి ప్రజా సంఘాలు ప్రజలను అంటి పెట్టుకుని ఉద్యమానికి అండగా నిలబడుతున్నాయి. అనేక మంది రచయితలు, రచయిత్రులు, కవులు ప్రజల ఉద్యమానికి అండగా గొంతు విప్పుతున్నారు. సోషల్ మీడియాలో ప్రజల వుద్యమానికి అండగా విస్తృత ప్రచారం సాగుతోంది. ఉద్యమ వార్తలు రాకుండా చేయాలని పాలకులు ఎంతగా ప్రయత్నిస్తున్నా, స్థానిక, జిల్లా విలేకరులు మాత్రం ప్రజల పక్షాన వార్తలను అందించేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు.

ఈ ఉద్యమానికి అండగా నిలబడడం రాష్ట్ర ప్రజల బాధ్యత. కొనసాగుతున్న విధ్వంసకర అభివృద్ధి నమూనాను వ్యతిరేకిస్తున్న పోరాటమిది. ప్రజల భాగస్వామ్యంతో, ప్రజల ప్రయోజనాల కనుగుణంగా పాలన సాగాలని నినదిస్తున్న వుద్యమమిది. పాలకుల నిరంకుశ పోకడలను, నిర్బంధాన్ని ఏ మాత్రం సహించబోమని చాటి చెబుతున్న ప్రజల గొంతు ఇది.

**"కరువు పీడిత ప్రాంతాలకు సాగు, త్రాగు నీరు అందాల్సిందే, కానీ గ్రామాల్నీ, భూముల్నీ ముంచి కాదు"**
**అని ప్రత్నామ్నాయ అభివృద్ధి నమూనాను డిమాండ్ చేస్తున్న ప్రజల పక్షాన దృఢంగా నిలబడదాం.**

*– కె. రవి...*

# వరిలో వివిధ సాగు పద్ధతులు

మనరాష్ట్రంలో వరి పంటను కాలువల కింద, చెరువుల కింద, బోరు బావుల కింద పండిస్తున్నారు. **1. నీటి సాగు పద్ధతి (పొలంలో నీరు నిల్వ ఉంచి పండించే పద్ధతి), 2. దమ్ములో విత్తు పద్ధతి, 3. మెట్ట సాగు పద్ధతి, 4. పరిమిత నీటి సాగు పద్ధతి, 5. శ్రీ పద్ధతి** లాంటివి రైతులు అనుసరిస్తున్నారు.


*వరి నారును ప్రధాన పొలంలో నాటడానికి ముందు 2 లీటర్ల ఆవుమూత్రం, 1 కిలో పశువుల పేడ, 1 కిలో మట్టి (గట్టు లేదా పుట్టమన్ను) 150 గ్రాముల ఇంగువ, 10 లీటర్ల నీటిలో కలిపి ద్రావణం తయారు చేసుకోవాలి. నారును ఆ ద్రావణంలో ముంచి నాటుకోవాలి.*

## నీటి సాగు పద్ధతి

నీటి సాగు పద్ధతిలో నాలుగు నుంచి ఆరు ఆకులున్న నారును ఉపయోగించాలి. నారు తీసేటప్పుడు మొక్కలు లేతాకుపచ్చగా ఉంటేనే మూన త్వరగా పెరుగుతుంది. ముదురు ఆకును నాటితే దిగుబడి తగ్గుతుంది.నాటుపైపైన నాటితే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశముంది. నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని అనుసరించి ఖరీఫ్‌లో చ.మీ.కు 33 మూనలు, రబీలో 44 మూనలు ఉండేలా చూడాలి. నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ బాటలు తీయటం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతిని కొంత వరకు అదుపుచేయవచ్చు.

## దమ్ములో విత్తు పద్ధతి

దమ్ములో విత్తనం వెదజల్లడం గానీ వరసలలో విత్తడం గానీ చేస్తారు. దీనిని చల్లు పద్ధతి లేదా అలుకుడు పద్ధతి అని అంటారు. ఈ పద్ధతిలో నారుమడి తయారీ, నారు పోయడం, నారు తీయడం, నాట్లు లేకపోవడం వలన శ్రమ, కూలీల ఖర్చు తగ్గుతాయి. నాట్ల పద్ధతిలో కన్నా 10-15 రోజుల ముందుగానే పైరు కోతకు వస్తుంది. సాగు నీరు ఆదా అవడమే కాకుండా పైరు నీటి ఎద్దడికి బాగా తట్టుకుంటుంది.



### నేరుగా దమ్ములో వెదజల్లి పండించటానికి పాటించవలసిన యాజమాన్య పద్ధతులు

వివిధ ప్రాంతాల్లో నాటటానికి అనువైన వరి వంగడాలే చాలా వరకు నేరుగా వెదజల్లి పండించటానికి కూడా అనుకూలం. కాండం గట్టిగా ఉండి, పడిపోని రకాలను ఎంపిక చేసుకోవాలి. పొలంలో మురుగునీరు పోవడానికి బోదెలు ఏర్పాటు చేసుకోవాలి. పొలాన్ని 15 రోజుల ముందుగా దమ్ముచేసి తరువాత విత్తడానికి 4 రోజుల ముందు మరొకసారి దమ్ముచేసి సమానంగా చదువుచేసి, మట్టి పేరుకున్న తర్వాత ప్రతి 2 మీ.లకు 20 సెం.మీ. కాలువలు చేయాలి. మొలకెత్తిన విత్తనాన్ని (ముక్కు బయటకు రాగానే), పొలంలో పలుచటి నీటి పొర ఉంచి సమానంగా వెదజల్లాలి లేదా 8 సాళ్ళ పరికరంతో నీరు పూర్తిగా తీసివేసి కూడా విత్తవచ్చు. మొక్కల మొదటి ఆకు పూర్తిగా విచ్చుకునే వరకు (సుమారు 7-10 రోజుల వరకు) పంటకు ఆరుతడులు అవసరం.


## మెట్ట సాగు పద్ధతి

ప్రతి జిల్లాలోనూ వరి పంటను కొద్దోగొప్పో వర్షాధారంతో పండిస్తారు. సాధారణంగా భూసారం తక్కువ, తేలిక నేలల్లో మెట్ట సాగు చేస్తున్నారు. జూన్, జులై నెలల్లో వర్షాలు పడిన వెంటనే నేలను లోతుగా దున్ని బాగా చివికిన పశువుల ఎరువు లేదా కంపోస్టును దుక్కిలో వేయాలి. అఖరిసారిగా దున్ని నేలను సమతలం చేయాలి. మెట్ట సాగులో ఎకరానికి గొర్రుతో విత్తడానికి 35 కిలోలు, వెదజల్లడానికి

40 కిలోల విత్తనం కావాలి. వర్షపు నీరు వీలైనంత ఎక్కువగా నేలలో ఇంకేటట్టు 15 రోజులకొకసారి వరుసల మధ్య అంతరకృషి చేయాలి. కలుపు మొక్కలు ఎక్కువగా రావడం వల్ల దిగుబడి తగ్గిపోకుండా ఉండటానికి సరైన సమయంలో కలుపు యాజమాన్యం చేయాలి. మెట్ట వరి సాగులో స్వల్పకాలిక వంగడాలు వేస్తాం కాబట్టి అవి వర్షాకాలంలోనే కోతకు వస్తాయి.

## పరిమితమైన నీటి సాగు పద్ధతి

మొదట మెట్ట సాగు, చెరువుకు నీరు వచ్చిన తర్వాత నీటి సాగుగా వరి పండించే పద్ధతిని పరిమిత నీటి సాగు లేదా మెట్ట-నీటి సాగు అనవచ్చు. నెల్లూరు, ప్రకాశం, కడప, చిత్తూరు జిల్లాల్లో ఈశాన్య రుతుపవన ప్రభావం వలన అధిక వర్షం కురిసే ప్రాంతంలో ఈ పద్ధతి అమలులో ఉంది. ఈ రకమైన సాగులో విత్తనాన్ని గొర్రుతో విత్తుతారు. విత్తేటప్పుడు నేల పై పొర 8-10 సెం.మీ. లోతు వరకూ తేమ ఉండేటట్లు చూసుకోవాలి. లేనిచో విత్తనం మొలకెత్తక ఖాళీలు వస్తాయి. వరి విత్తనాలకంటే ముందుగా కలుపు విత్తనాలు వస్తాయి కాబట్టి విత్తన 15 రోజుల నుంచి 15 రోజులకు ఒకసారి వరుసల మధ్య దంతి తోలాలి. వరుసలలో మొక్కల మధ్య కలుపు మొక్కలను తీసివేయాలి.



### కాలి బాటలు వదలటం

వరిని ఏ పద్ధతిలో పండించినా కనీసం ప్రతి రెండు మీటర్లకు దారులు వదలడం వలన వరిచేలో గాలి బాగా పోసుకోవడానికి పురుగులు, తెగుళ్ళ ఉధృతి తగ్గడానికి బాగా ఉపయోగపడుతుంది. గట్ల వెంట, దారుల వెంట మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి. ఇతర అంతర కృషి పనుల పరిశీలనకు కూడా ఈ కాలిబాటలు వుపయోగపడతాయి. ముందు పొలం అంతా నాటు వేసిన తర్వాత 2 మీటర్లకు ఒక తాడు కట్టి దానికి రెండు పక్కలా మొక్కలను తీసి మధ్యలో నాటాలి.

## నేల ఉత్పాదక శక్తిని పెంచే 'అమృతజలం'

అమృతజలం అనేది ఆవుపేడ, ఆవు మూత్రంతో చేసే ఒక సేంద్రియ ఉత్పత్తి. పొలంలో సూక్ష్మజీవుల సంఖ్యను అభివృద్ధి చేయడానికి దీన్ని ఉపయోగిస్తారు. దాణా కాకుండా గడ్డిని ఆహారంగా తీసుకునే గేదెల పేడ, మూత్రమునైనా అమృతజలం తయారీకి వాడుకోవచ్చు. అమృతజలం తయారీకి ఒక లీటరు ఆవు మూత్రం, ఒక కిలో తాజా ఆవుపేడ, 100 గ్రాముల బెల్లం, 10 లీటర్ల నీరు అవసరం.

### తయారీ పద్ధతి:

పెద్దపాత్రలో లేదా సిమెంట్ తొట్టిలో నీరుపోయాలి. అందులో తాజా ఆవుపేడ వేసి బాగా కలియబెట్టాలి. తరువాత 100 గ్రాముల బెల్లం కలిపి బాగా కలపాలి. చివరికి ఆవు మూత్రాన్ని అందులో కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక రాత్రంతా అలాగే ఉంచి మర్నాడు ఉపయోగించాలి. చివర్న ఉపయోగించే ముందు దానికి 10 రెట్ల నీరు కలిపి సజల ద్రావణంగా మార్చాలి. ఇలాంటి ద్రావణం ఒక ఎకరా పంట పొలానికి 500 లీటర్లు అవసరమవుతుంది. ఈ సజల ద్రావణాన్ని సాగు నీటి పారుదలలో కలిపి ఉపయోగించవచ్చు. లేదా నేరుగా మొక్కలపై పిచికారీ చేయవచ్చు. అమృత జలం నేల ఉత్పాదక శక్తిని, దిగుబడిని పెంచుతుంది. బీడుపడిన నేలలను పునర్జీవింపచేయడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది.

# బెంజ్ కారు - బంజారా గోడు

పి. సాయినాథ్, పి.ఎ.ఆర్.ఐ. ఎడిటర్

ఔరంగాబాద్ జిల్లాలో హీరాబాయి వంటి పేద రైతులు 15.9 శాతం వడ్డీకి ట్రాక్టర్ రుణాలను తీసుకుని అప్పుల ఊబిలో దిగబడిపోయారు. అదే జిల్లాలో పలువురు సంపన్నులు 7 శాతం వడ్డీకే ఖరీదైన మెర్సిడెస్ బెంజ్ కార్ల కొనుగోలుకు 'కారు' చవక రుణాలు పొందారు. ఈ రెండు రకాల రుణాలు గ్రామీణ ప్రగతికి చిహ్నాలని విశ్లేషకులు భావించడం పెద్ద విడ్డూరం.

హీరాబాయి ఫకీరా రాఠోడ్‌కు అసలు ట్రాక్టర్ కొనే ఉద్దేశమే లేదు. కానీ, 2010లో బ్యాంకులు పెద్ద ఎత్తున ట్రాక్టర్ రుణ మేళాను చేపట్టినప్పుడు, ఓ విక్రయదారు ఆమె బుర్రలో అలాంటి ఉద్దేశాన్ని నాటాడు. 'ట్రాక్టర్ రుణం తేలిగ్గా లభిస్తుందనీ, తర్వాత దాన్ని తీర్చివేయడమూ చాలా సులువని ఆ విక్రయదారు నాకు నూరిపోశాడు' అని హీరాబాయి గుర్తుచేసుకున్నారు. ఔరంగాబాద్ జిల్లా కన్నడ్ తహశీలులో శిథిలావస్థలో వున్న ఒక ఇంట్లో నివసిస్తున్న ఆమె ఓ బంజారా ఆదివాసీ. ఆమె రుణ దరఖాస్తును స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ శాఖ చకచకా పరిశీలించి ఆమోదముద్ర వేసేసింది. హీరాబాయి భర్త పదవీవిరమణ చేసిన అటవీ గార్డు. వారిది పెద్ద కుటుంబం. ఇదే తహశీలులో వారికి మూడున్నర ఎకరాల భూమి వుంది. 'రుణం తీసుకుని ట్రాక్టర్ కొంటే సొంత పొలం దున్నుకోవడంతోపాటు, ఇతరుల పొలాలూ దున్ని కొంత డబ్బు ఆర్జించవచ్చునని అనుకున్నాం' అని ఆమె చెప్పారు. రూ. 6,35,000 ధర పలికే ట్రాక్టర్ కొనుగోలుకు రూ. 5,75,000 బ్యాంకు రుణం పొందారామె. ఈ రుణాన్ని 15.9 శాతం వడ్డీపై ఏడు సంవత్సరాలలో తీర్చివేయాలి. ఇంత అప్పు చేసి ట్రాక్టర్ కొనడం 'జీవితంలో నేను చేసిన అతి పెద్ద తప్పు' అని బాధగా నిట్టూర్చారు హీరాబాయి. ట్రాక్టర్ రుణ ఖాతా పత్రాలను మాకు చూపారావిడ. 2016 మార్చి వరకు బాకీ కింద రూ. 7.5 లక్షలకు పైగా చెల్లించి దివాళా తీశారు. మరి రూ. 1.25 లక్షలు చెల్లిస్తే ఒకే దఫాలో రుణ పరిష్కారం (ఓటీఎస్) లభిస్తుందని బ్యాంకువారు ప్రతిపాదించారు. హీరాబాయి ఈ డబ్బును బంధువుల నుంచి అప్పుగా తీసుకుని బ్యాంకుకు చెల్లవేశారు. 'బ్యాంకు రుణ భారాన్ని నా పిల్లలపై మోపకూడదని భావించాను' అని ఆమె వివరించారు.

ఏ మాత్రం ఆర్థిక స్తోమత లేని ఈ బంజారా మహిళ అష్టకష్టాలు పడి మొత్తం 9 లక్షల రూపాయలను బ్యాంకుకు కట్టారు. ఇంతాచేసి ఆమె తీసుకున్న రుణం రూ. 5.75 లక్షలు మాత్రమే. మహారాష్ట్రలో క్షామ పీడిత మరాఠ్వాడా ప్రాంతంలో వ్యవసాయం బొత్తిగా పడకేయడంతో, హీరాబాయి కొన్న ట్రాక్టర్‌కు ఇతరుల పొలాల్లో పని దొరకనే లేదు. ఒక్క ఔరంగాబాద్‌లోనే కాదు, దేశమంతటా హీరాబాయిలాంటి వారెందరో వున్నారు. హీరాబాయి అయితే ఎలాగోలా అప్పు తీర్చగలిగారు కానీ, మిగిలినవారిలో అత్యధికులకు ఆ వెసులుబాటు లేకపోయింది. రైతులు అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకోవడం మహారాష్ట్రలో చాలా చాలా ఎక్కువ. అలాంటి రాష్ట్రంలో ఒక్క మరాఠ్వాడా ప్రాంతంలోనే స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్.బి.హెచ్) 2005-06 నుంచి ఇంతవరకు వెయ్యి ట్రాక్టర్ కొనుగోలు రుణాలిచ్చింది.

'బ్యాంకులు ఎడాపెడా ట్రాక్టర్ రుణాలు ఇచ్చేశాయి. ప్రాధాన్య రంగ కోటా కింద అవి రుణాలివ్వాల్సి వుంది. ట్రాక్టర్ రుణాలు వ్యవసాయ రుణాలకిందకు వస్తాయి కాబట్టి బ్యాంకులు జోరుపెంచాయి. తమ కోటాను పూర్తి చేయడం కోసం ఆర్థిక స్తోమత లేనివారికి సైతం బాగా ఎక్కువ వడ్డీకి ఈ రుణాలను అంటగట్టాయి. "హీరాబాయి ఎలాగోలా ఒకే దఫాలో రుణ పరిష్కారం చేసుకోగలిగింది కానీ, అలా రుణాన్ని తీర్చుకోలేక కిస్తీల మీద కిస్తీలు కడుతున్నా రుణ భారం ఎంతకూ తగ్గని అభాగ్యులు వేలల్లో వుంటారు. అంతేకాదు, అసలు నెలసరి కిస్తీలే కట్టలేనివారు మరెందరో వున్నారు' అని అఖిల భారత బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి

*కన్నడ్‌లో హీరాబాయి ఇంటికి వెళ్లిన మా బృందాన్ని చూసి బ్యాంకు అధికారులుగా పొరబడిందావిడ. 'ఇప్పుడు నా పరిస్థితి ఏమవుతుంది?' అని భయం భయంగా అడిగిందామె. రూ. **6.35** లక్షలు (బహుశా అంతకన్నా తక్కువ) విలువ చేసే ట్రాక్టర్ కొనడానికి రూ. **5.75** లక్షల బ్యాంకు రుణం తీసుకుని, ఇప్పటికే రూ.**9** లక్షలు చెల్లించిన హీరాబాయి, 'నేను తీర్చాల్సిన బాకీ ఇంకా ఉందా?' అని ఆందోళనగా ప్రశ్నించారు. లేదు, నీవు చెల్లించాల్సిన దానికన్నా చాలా ఎక్కువే చెల్లించావని ఆవిడకు చెప్పాం.*

దేవీదాస్ తుల్జాపూర్కర్ వెల్లడించారు. ఒక్క కన్నడ్ తహశీలులోని ఎస్.బి.హెచ్ శాఖ నుంచే రుణం తీర్చలేకపోతున్న 45 మంది ఖాతాలను సేకరించాం. వీరంతా బ్యాంకుకు తీర్చాల్సిన రుణం రూ. 2.7 కోట్లు. ఇవి కేవలం ఒక్క రాష్ట్రంలోని ఒక చిన్న పట్టణంలో ఒకే ఒక్క బ్యాంకు శాఖ నుంచి సేకరించిన వివరాలు. దేశమంతటా వివిధ బ్యాంకుల శాఖల్లో ఇలాంటి రుణ ఖాతాలు వేలల్లో వుంటాయి.

హీరాబాయి 15.9 శాతం వడ్డీకి ట్రాక్టర్ రుణం పొందిన సమయంలోనే, ఆమె ఊరికి కేవలం 65 కిలోమీటర్ల దూరంలోని ఔరంగాబాద్ నగరంలో మరో పెద్ద రుణ మేళా జరిగింది. ఆ నగరంలోని పారిశ్రామికవేత్తలు, వున్నతాధి కారులు, వైద్యులు, న్యాయవాదులు, ఇతర వృత్తినిపుణులతో ఏర్పడిన 'ఔరంగాబాద్ గ్రూపు' 2010 అక్టోబరులో ఒకే ఒక్క రోజున 150 అత్యంత ఖరీదైన మెర్సిడెస్ బెంజ్ కార్లు కొన్నది. (ఈ గ్రూపు సభ్యుడొకరు తర్వాత ఔరంగాబాద్ తూర్పు నియోజక వర్గం నుంచి విధాన సభకు ఎన్నికయ్యారు). ఔరంగాబాద్ ఎంతో ఎదిగిందనడానికి బెంజ్ కార్ల కొనుగోలే నిదర్శనమనీ, దీంతో నగరం అంతర్జాతీయ పెట్టుబడుల పటంలో ప్రముఖ స్థానం సంపాదించిందనీ కొందరు గ్రూపు సభ్యులు అప్పట్లో వ్యాఖ్యానించారు. వారు ఈ విజయం సాధించడానికి బ్యాంకులు దండిగా సాయం చేశాయి. ఆ రోజు విక్రయమైన బెంజ్ కార్ల ధరలు రూ. 30-70 లక్షల వరకు వున్నాయి. కేవలం 24 గంటల్లో 150 లగ్జరీ కార్లు విక్రయమవుతున్నాయి కాబట్టి, బెంజ్ కంపెనీ ధరలను బాగా తగ్గించింది. అప్పటి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడి ప్రత్యేక ఆదేశాన్ని పురస్కరించుకుని ఔరంగాబాద్ ఎస్.బి.హెచ్ బాగా తక్కువ వడ్డీకి వాహన రుణాలిచ్చింది. మొత్తం బెంజ్ కార్ల విక్రయ ధర 65 కోట్ల రూపాయలు కాగా, అందులో మూడింట రెండు వంతుల్ని కేవలం 7 శాతం వడ్డీకే రుణంగా ఇచ్చింది.

ఇలా ఒకే దఫాలో 150 కార్లు అమ్మిన ఆనందంలో మెర్సిడెస్ బెంజ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ విల్ ఫ్రీడ్ ఔల్బర్, భారతదేశంలోని రెండవ, మూడవ అంచె పట్టణాలకూ అపారమైన ఆర్థిక సత్తా సమకూరడం ప్రశంసనీయమని వ్యాఖ్యానించారు. 'నేడు ఈ సత్తా అమోఘంగా, సాహసోపేతంగా ఒకే దెబ్బకు 150 మెర్సిడెస్ బెంజ్ కార్ల కొనుగోలులో వ్యక్తమైంది' అని ఆయన సంబరపడ్డారు.

ఔరంగాబాద్ జిల్లాలో ఇతర చోట్ల హీరాబాయి వంటి ట్రాక్టర్ కొనుగోలుదారులకు మరో రకమైన దెబ్బతగిలింది. బెంజ్, ట్రాక్టర్ గ్రూపులు రెండూ పేరుకు వాహన రుణాలే తీసుకున్నాయి. అదీ ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచే. కానీ, నగర సంపన్నులకన్నా హీరాబాయి రెండింతలు ఎక్కువ వడ్డీకి రుణం తీసుకుంది. బహుశా ఆమె ఔరంగాబాద్ ను అంతర్జాతీయ పెట్టుబడుల పటంలోకి ఎక్కించలేకపోవడం వల్లనే ఎక్కువ వడ్డీ చెల్లించాల్సి వచ్చిందా! 12.5 నుంచి 15.9 శాతం వడ్డీ రేటుకు ట్రాక్టర్ రుణాలు తీసుకున్న వారిలో ఎక్కువ మంది ఆదివాసీలు, దళితులే. వీరెవరూ బెంజ్ కార్లు కొనుగోలు చేయలేరు, చేయలేదు కూడా.

తేల్వాడీ తండాకు చెందిన వసంత్ దళపత్ రాథోడ్ రూ. 1.75 లక్షల ఓటిఎస్ చార్జితో సహా మొత్తం రూ. 7.53 లక్షలను ఎస్.బి.హెచ్, కన్నడ్ తహశీలు శాఖకు చెల్లించారు. అంబా తండాకు చెందిన మరో బంజారా అమర్ సింగ్ ముఖారాం రాథోడ్ అదే బ్యాంకుకు రూ. 11.14 లక్షలు బాకీపడ్డాడు. ఇంతా చేసి అతడు తీసుకున్న రుణం అందులో నగవే. అయినా ఇంతవరకు ఒక్క కిస్తీ కూడా చెల్లించలేకపోయాడు, బహుశా ఎప్పటికీ చెల్లించలేడేమో! అతడి కోసం వెతుకుతూ వెళ్లిన మా బృందానికి, అసలు అమర్ సింగ్ అనే వ్యక్తి ఎవరూ ఇక్కడ లేరని ఇరుగుపొరుగులు చెప్పుకొచ్చారు. అతడి కోసం బ్యాంకువాళ్లు వస్తున్నారనే వార్త తండాలో ముందుగానే వ్యాపించడం దీనికి కారణం. అమర్ సింగ్ ఇంటి వద్ద మాకు ట్రాక్టర్ కానీ, మరేదైనా విలువైన వస్తువు కానీ కనబడనే లేదు. ఒక పేదవాని పేరు మీద స్తోమత ఉన్న వ్యక్తి రుణం తీసుకోవడం తరచుగానే జరుగుతుంది. ఇదీ అలాంటి వ్యవహారమే కావచ్చు. కన్నడ్‌లో 45 కేసులతో పాటు ఇతర తహశీళ్లలో, బ్యాంకు శాఖల పరిధిలోకి వచ్చే ట్రాక్టర్ రుణ బకాయిదారుల వివరాలనూ మేము సేకరించాం.

'బ్యాంకులు ఈ రుణాలలో ఏ ఒక్కదాన్నీ నిరర్థక ఆస్తిగా ప్రకటించలేదు. మొత్తం ట్రాక్టర్ రుణాలు కోట్లలో ఉంటాయి. వీటిని బ్యాంకులు కాగితాల మీద రాబడి వస్తున్న ఖాతాలుగా చూపుతాయి. నిజానికి అసలు రుణంకన్నా రావలసిన బకాయిలు రెండింతలు ఎక్కువ ఉంటాయి. వీటిలో ఒక్క పైసా కూడా చెల్లించని కేసులు ఎన్నెన్నో. రుణ చెల్లింపు గడువు ఎన్నడో పూర్తయిపోయినా, ఖాతాను మామూలు ఖాతాగానే చూపుతుంటారు. కానీ, నిజం ఎప్పుడో ఒకప్పుడు బయటపడక తప్పదు' అని తుల్జాపూర్కర్ చెప్పారు. అదీకాకుండా పేదలను ట్రాక్టర్ డీలర్లు, దళారులు మోసం చేస్తుంటారు. 'వీరు ట్రాక్టర్ తోపాటు ట్రాలీనీ, ఇతర అనుబంధ పరికరాలను కూడా

కొనడానికి బ్యాంకు నుంచి రుణం మంజూరు చేయిస్తారు. రైతుకు ట్రాక్టర్ మాత్రం అప్పజెప్పి మిగతా మొత్తాన్ని తమ జేబులో వేసుకుంటారు ' అని కూడా ఆయన వివరించారు.

బెంజ్ కొనుగోలుదార్లలో రుణం ఎగ్గొట్టిన శాల్తీలు లేకపోలేదు. 'చాలా కార్లను రెండు సార్లు, మూడుసార్లు, అంతకన్నా ఎక్కువసార్లే వేరేవాళ్లకు అమ్మారు' అని ఔరంగాబాద్‌కు చెందిన ఒక ప్రముఖ పారిశ్రామికవేత్త చెప్పారు. కొంతమంది అయితే ముదరానూ, తక్కువ వడ్డీ రేట్లనూ సొమ్ము చేసుకుని, వెంటనే కారును వేరేవాళ్లకు లాభానికి అమ్మేశారని మరో ప్రముఖుడు వెల్లడించారు.

2004-14 మధ్యకాలంలో భారత్‌లో ట్రాక్టర్ అమ్మకాలు మూడింతలు పెరిగాయి. 2013లో భారత్ 6,19,000 ట్రాక్టర్లను ఉత్పత్తి చేసింది. ఇది ప్రపంచ వుత్పత్తిలో మూడోవంతు. ఇది గ్రామీణ ప్రగతికి నిదర్శనమనీ, గ్రామీణ భారత విజయాలకు చిహ్నమనీ అనేక మంది కీర్తించారు. గ్రామాల్లో కొన్ని వర్గాల ఆదాయాలు పెరిగి, ట్రాక్టర్ అమ్మకాలు ఊపందుకున్న మాట నిజమే. కానీ, దానికన్నా బ్యాంకులు ఎడాపెడా రుణాలివ్వడమే అమ్మకాల విజృంభణకు ప్రధాన కారణం. సాంఘిక, ఆర్థిక, కుల గణన ప్రకారం కేవలం 8 శాతం గ్రామీణ కుటుంబాల్లోనే నెలకు రూ. 10,000కు పైగా ఆదాయం ఆర్జించే సభ్యులున్నారు. (ట్రాక్టర్ కొన్న కుటుంబాల సంఖ్య ఎనిమిది శాతంకన్నా బాగా తక్కువ). వాస్తవాలు ఇలా వుంటే, ట్రాక్టర్ అమ్మకాలు గ్రామీణ భారతం పురోగమిస్తోందనడానికి సూచి అని కొందరు ఆర్థికవేత్తలు, పాత్రికేయులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు ఔరంగాబాద్ డీలర్లు ట్రాక్టర్ అమ్మకాలు సగానికి సగం తగ్గిపోయాయంటున్నారు. ఈ లెక్కన గ్రామీణ ప్రగతి పడకేసినట్లే కదా!

మెర్సిడెస్ బెంజ్ విలాస వస్తువైతే ట్రాక్టర్ ఉత్పాదక వస్తువు. కానీ, 2004-14 మధ్య కాలంలో అప్పులిచ్చి పెంచిన ట్రాక్టర్ విక్రయాలను శీఘ్ర గ్రామీణ ప్రగతికి నిదర్శనంగా చూపడం హాస్యాస్పదం. అలాగే 150 బెంజ్ కార్లను ఒకే రోజు అమ్మి ఔరంగాబాద్ అంతర్జాతీయ పెట్టుబడుల పటంలోకి ఎక్కిందనడమూ హాస్యాస్పదమే. మరాఠ్వాడా ప్రాంతంలో తలసరి ఆదాయం రూ. 64,330 మాత్రమే. ఇది మహారాష్ట్రలోనే అతి తక్కువ. ఖచ్చితంగా చెప్పాలంటే మరాఠ్వాడా తలసరి ఆదాయం మహారాష్ట్రలోని ఇతర ప్రాంతాలకన్నా 40 శాతం, ముంబయ్ కన్నా 70 శాతం తక్కువ.

ఇది ఇలా వుండగా, మహారాష్ట్రలో సరికొత్త దివాలా సంక్షోభం ముంచుకొస్తోంది. ఈసారి ముప్పు మట్టి తవ్వకం యంత్రాల (ఎక్స్‌కవేటర్ల) రూపంలో పొంచి వుంది. మహారాష్ట్రతో పాటు అనేక ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మానవ కూలీలకన్నా ఎక్స్ కవేటర్ యంత్రాల మీద ఆధారపడటం ఎక్కువైపోయింది. ఈ యంత్రాల కొనుగోలుదారులలో అనేకమంది డబ్బు పోగొట్టుకొని దివాలా తీయబోతున్నారని స్వయాన కాంట్రాక్టర్, ఖుల్తాబాద్ పట్టణ మునిసిపల్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు హాజీ అక్బర్ బేగ్ చెప్పారు. 'కేవలం 19,000 జనాభా గల మా చిన్న పట్టణంలోనే ఏకంగా 30 జేసీబీలు (జె.సి. బామ్ ఫర్డ్ తవ్వకం యంత్రాలు) వున్నాయి. రాష్ట్రమంతటా మరెన్ని జేసీబీలున్నాయో ఎవరికి ఎరుక?' అన్నారాయన. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం జలయుక్త్ శివర్ అభియాన్ తదితర పథకాల్లో జేసీబీలను ఎక్కువగా వాడుతున్నందువల్ల, వీటికి బాగా గిరాకీ వుంటుందనుకొని చాలా మంది జేసీబీలను కొనుగోలు చేశారు. ఒక్కో యంత్రం ధర రూ. 29 లక్షలు. వీటిని కొనడానికి ప్రైవేటు బ్యాంకుల నుంచి, బ్యాంకేతర ఆర్థిక సంస్థల (ఎన్.బి.ఎఫ్.సి) నుంచీ భారీగా రుణాలు తీసుకున్నవారెందరో. 'మొదట్లోనే జేసీబీలను కొన్నవారిలో నేనూ వున్నాను. కానీ, నేను బ్యాంకు నుంచి రుణం తీసుకోలేదు. పాత యంత్రాలను అమ్మి, కుటుంబ సభ్యుల నుంచి కొంత డబ్బు అప్పుగా తీసుకొని జేసీబీని కొనుగోలు చేశాను' అని బేగ్ వివరించారు.

'జేసీబీల నిర్వహణ ఖర్చులు ఎక్కువగా వుంటాయి. వీటిని తట్టుకొంటూ నెలనెలా బ్యాంకు రుణవాయిదా చెల్లిస్తూ బండి నడపాలంటే నెలకు కనీసం లక్షరూపాయల ఆదాయం రావాలి. ఎండా కాలంలో ఆ మేరకు పనులు లభించినా, వర్షాకాలంలో ఆ పరిస్థితి ఉండదు. పట్టణంలో ఇప్పుడున్న 30 జేసీబీలకు కాదు కదా, కనీసం 3 జేసీబీలకు సరిపడా పనులైనా లభించవు. అప్పుడు పరిస్థితి ఏమిటి? ఈ రంగంలో అనుభవం లేనివారు కూడా భారీ పోక్లైన్ హైడ్రాలిక్ ఎక్స్ కవేటర్లను కొనుగోలు చేశారు. వీటి ధర జేసీబీల కన్నా రెట్టింపు వుంటుంది. వీటిని కొనడానికి మళ్లీ బ్యాంకుల మీద ఆధారపడాల్సిందే. ఇంతటి భారీ రుణాలు తీర్చలేక చాలా మంది మునిగిపోతున్నారు. ఇక్కడే కాదు, ఇతర చోట్లా ఇదే పరిస్థితి ఉందని అనుమానిస్తున్నా. బాగా పరిచయాలున్న కొద్దిమంది వ్యాపారులకే కాంట్రాక్టులు లభిస్తాయి. ప్రతి 100 మందిలో 10 మంది వ్యాపారంలో నిలబడతారేమో! మిగతావాళ్లు దివాలా తీస్తారు' అని బేగ్ చెప్పుకొచ్చారు.

## 14 గ్రామాలు, 3,112 ఇళ్లు, 20,079 ఎకరాలను ముంచనున్న

# మల్లన్న సాగర్ ఎవరి కోసం?

ప్రభుత్వం స్పష్టంగా, నిర్దిష్టంగా, కచ్చితంగా చెప్పకపోయినా, అనేక వనరుల నుంచి ముక్కలు ముక్కలుగా వస్తున్న సమాచారాన్నంతా ఒక్కదగ్గరికి చేరిస్తే, దానిలో భిన్న కథనాల మధ్య వాస్తవాన్ని గ్రహిస్తే, అరకొరగా చెపుతున్న వాటి నుంచి వాస్తవం ఏమై ఉంటుందో నిర్ధారిస్తే, అసలు ఈ పథకం ఏమిటో ఒక అంచనాకు రావచ్చు.

ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న మల్లన్న సాగర్ ప్రాజెక్టుకు పూర్వరూపం తడ్కపల్లి చెరువు. అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా 2007లో తయారు చేసిన, 2008 ఏప్రిల్ 11న శంకుస్థాపన చేసిన ప్రాణహిత - చేవెళ్ల ఎత్తిపోతల భారీ పథకంలో అనుసంధానం చేసిన 23 జలాశయాలు / చెరువులలో తడ్కపల్లి చెరువు ఒకటి. అప్పుడు దాని ప్రతిపాదిత నీటి నిలువ సామర్థ్యం 1.5 టి.ఎం.సి.లు (టి.ఎం.సి. అంటే 1,000 మిలియన్ క్యూబిక్ ఫీట్ - శతకోటి ఘనపుటడుగుల నీరు - 2,831 కోట్ల లీటర్ల నీరు). ఆ తర్వాత డా॥ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి అని పేరు మార్చిన ఈ పథకానికి రూ. 17,875 కోట్లు ఖర్చు అవుతాయని 2007 మేలో అంచనా వేశారు. త్వరలోనే కొన్ని అదనపు లక్ష్యాలు కలిపి 2008 డిసెంబర్ నాటికి ఈ అంచనాను రూ. 38,500 కోట్లకు పెంచారు. దీని వల్ల 12.2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని మొదట ప్రకటించి, దాన్ని 16.4 లక్షల ఎకరాలకు పెంచారు. ఆ ప్రాజెక్టును, నాలుగు సంవత్సరాలలో, 2012 నాటికి పూర్తి చేస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. తర్వాత దాన్ని ఎనిమిది సంవత్సరాలకు పొడిగించింది. ఈ వాగ్దానాలు, ప్రకటిత లక్ష్యాలు అన్నీ అబద్ధాలేనని కాలక్రమంలో రుజువయ్యాయి. జలయజ్ఞంలోని మిగిలిన ప్రాజెక్టులన్నిటిలాగే వేల కోట్ల రూపాయలు కాంట్రాక్టర్లకు దక్కాయి గానీ నీళ్లు రాలేదు. అదనపు ఆయకట్టు ఏర్పడలేదు.

అసలు మొత్తంగా జలయజ్ఞం పేరుతో వచ్చిన అనేక నీటి పారుదల పథకాలతో జరిగినది జలయజ్ఞం కాదనీ, ఒక 1,86,000 రూపాయలు మాయ అనీ ప్రపంచ ప్రఖ్యాత పర్యావరణ పక్షపత్రిక డౌన్ టు ఎర్త్ 2012 జూలై లోనే రాసింది. "పెట్టుబడుల అనుమతులు లేకుండానే 24 ప్రాజెక్టులు ప్రారంభించారు. 21 ప్రాజెక్టులకు అటవీ అనుమతులు లేవు. 18 ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు లేవు. నాలుగు ప్రాజెక్టులకు సాధ్యతా నివేదికలు లేవు. పదహారు ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం అనుమతులు లేవు" అని రాజ్యాంగబద్ధ సంస్థ కంట్రోలర్ అండ్ అడిటర్ జనరల్ (కాగ్) చెప్పింది. ఈ కుంభకోణం మీద విస్తృత పరిశోధన చేసిన ఫస్ట్ పోస్ట్ వెబ్ సైట్ ప్రకారం ఒక లక్షా ఎనభై ఆరువేల కోట్ల రూపాయల జలయజ్ఞంలో ఏ పనీ జరగకుండానే తొంభైవేల కోట్లు రాజకీయ నాయకులకు, రాజకీయ నాయకులైన కాంట్రాక్టర్లకు, వారి ఆశ్రితులకు దక్కాయి.

2012లోనే కాగ్ ప్రత్యేకంగా జలయజ్ఞం మీద ఒక నివేదిక ప్రచురించింది. ఆ నివేదిక ప్రకారం ప్రాణహిత చేవెళ్ల పథకం కింద అప్పటికి ఎన్నో అవకతవకలతో రూ. 2,205 కోట్లు ఖర్చయి (కాంట్రాక్టర్లకు దక్కి) ప్రకటిత లక్ష్యాలలో పదోవంతు కూడా అమలులోకి రాలేదు. ఆ తర్వాత 2015 జనవరిలో అధికారిక అంచనాల ప్రకారం ఈ ప్రాజెక్టు పేరు మీద రూ. 7,000 కోట్లు ఖర్చయి, కాంట్రాక్టర్లకు దక్కాయి గానీ, ప్రధాన ఆనకట్ట ఎత్తు ఎంత ఉండాలనే నిర్ణయమే జరగలేదు. అలా అసలు ప్రధానాంశమే తేలకుండా ఇంతింత ఖర్చు జరిగిపోయిందంటే, ఈ ప్రాజెక్టు ప్రజల కోసం కాదనీ, నీళ్ల కోసం కాదనీ, కాంట్రాక్టర్ల బొక్కసాలు నింపడానికి మాత్రమేననీ సులభంగా అర్థం చేసుకోవచ్చు. పేరుకు కొన్ని చోట్ల కాలువలు తవ్వడం జరిగింది గానీ అవి అవసరమైన లోతు కాలువలు కావు. పూర్తి కాలువలు తవ్వినట్టుగా కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరయ్యాయి. తవ్విన కాలువలు పూడిపోయాయి. ఎక్కడైనా, ఎవరికైనా నీళ్లు అందితే అది ద్వితీయ స్థాయి, ఉప ఉత్పత్తి మాత్రమే గాని ప్రధానోత్పత్తి

కాంట్రాక్టర్ల బొక్కసాలు నింపడమేనని కాగ్ నివేదికే స్పష్టం చేసింది. ప్రాణహిత - చేవెళ్ల పథక రచన ఒక కుట్ర అని స్వయంగా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు శాసనసభ ప్రసంగంలో అభివర్ణించారు. ఈ పథకం పేరు మీద ఎనిమిది వేల కోట్ల రూపాయల అక్రమాలు జరగాయని ఆయనే అన్నారు.

అలా పాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాంట్రాక్టర్ల కోసం మాత్రమే తయారు చేసిన ఆ అవకతవకల, అక్రమాల పథకాన్నే తెలంగాణ ప్రభుత్వం దుమ్ముదులిపి, అలంకరించి, మళ్లీ ముందుకు తెచ్చింది. ఈ అలంకరణ పేరే రీడిజైనింగ్. పాత ప్రాజెక్టుల రూపకల్పన తెలంగాణా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని జరగలేదని, కాంట్రాక్టర్లను దృష్టిలో పెట్టుకుని జరిగిందని, అందువల్ల తెలంగాణా ప్రభుత్వం అనివార్యంగా రీడిజైనింగ్ చేయవలసి వస్తున్నదని ముఖ్యమంత్రి నిజంగానే అభినందించదగిన మాట అన్నారు. ఆ మాట విన్న ఎవరైనా రీడిజైనింగ్‌లో పాత కాంట్రాక్టర్ల తొలగింపు అనివార్యంగా వుంటుందని ఆశిస్తారు. కానీ రీడిజైనింగ్‌లో ఏ ఒక్క ప్రాజెక్టులోనూ కాంట్రాక్టర్లు మారలేదు.

రీడిజైనింగ్‌లో భాగంగా 1.5 టి.ఎం.సి నీటి నిలువ సామర్థ్యంతో వుండిన తడ్కపల్లి చెరువును తొలగించి, దాని స్థానంలో మల్లన్న సాగర్ నిర్మించాలని తలపెట్టారు. మల్లన్న సాగర్ నీటి నిలువ సామర్థ్యాన్ని ఏకాఎకిన 50 టి.ఎం.సి.లకు పెంచారు. అంతకు ముందరి రూ. 38,500 కోట్ల పథకమల్లా, ప్రస్తుతం రీడిజైనింగ్‌తో రూ. 83,000 కోట్ల పథకంగా మారింది. ప్రాంతం మారింది, పథకం మారింది, పేరు మారింది. సామర్థ్యం మారింది, ఖర్చు రెట్టింపు అయింది. కానీ, ఆశ్చర్యకరంగా కాంట్రాక్టర్లు మాత్రం మారలేదు. ఒకటిన్నర టి.ఎం.సి.ల సామర్థ్యపు ప్రాజెక్టు గుత్తేదారులే, ముప్పై ఆరు రెట్లు సామర్థ్యం పెరిగిన ప్రాజెక్టుకూ పనికి వచ్చారు. ఆ గుత్తేదార్లు రెండు నిర్మాణ కంపెనీలు కలిసి ఏర్పడిన సంయుక్త సంస్థ. మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎం.ఇ.ఐ.ఎల్ - మేఘా పేరుతో రాష్ట్రంలో ఇంకా ఎన్నో ప్రాజెక్టులు సొంతం చేసుకున్న కాంట్రాక్టర్ కంపెనీ) ఆ రెండిటిలో ఒకటి. ఇది మాజీ ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి సహచరుడు, కాంగ్రెస్ నాయకుడు డా॥ కె.వి.పి. రామచంద్రరావు బేనామీ కంపెనీ అనీ, లేదా ఆయనకు వాటాలు వున్న కంపెనీ అని వదంతులున్నాయి. ఎస్.ఇ.డబ్ల్యు ఇన్ఫ్రాస్ట్రక్చర్ (సూ అనే పేరుతో ప్రఖ్యాతమైన సదరన్ ఇంజనీరింగ్ వర్క్స్ అనే కంపెనీ) అనేది రెండవది. ఇదే కంపెనీ తెలంగాణ ఆకాంక్షలకు వ్యతిరేకమైన, మూడు లక్షల మంది ఆదివాసులను నిర్వాసితులను చేస్తున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ప్రధాన పాత్ర వహిస్తున్నది. దీనిలో నమస్తే తెలంగాణా దినపత్రిక మాజీ యజమాని, ప్రస్తుతం భారతీయ జనతా పార్టీలో వున్న సి.ఎల్. రాజంకు వాటాలు వున్నాయని అంటారు. ఈ రెండు నిర్మాణ కాంట్రాక్టు కంపెనీలు కూడా ప్రారంభించినదీ, ఇప్పటికీ నడుపుతున్నదీ కృష్ణా జిల్లాకు చెందిన వ్యక్తులు. తెలంగాణా ఉద్యమకాలంలో విమర్శలకు గురైన కాంట్రాక్టర్ల కూటములకు చెందినవారు. కాకపోతే, ఈ రెండు కంపెనీలలో నేరుగానో, బేనామీగానో తెలంగాణా నంవన్నుల ప్రయోజనాలు కూడా ఉన్నాయని వదంతులున్నాయి.

పాత డిజైన్‌లోని తడ్కపల్లి సముద్ర మట్టానికి 1,663 అడుగుల (506 మీటర్ల) ఎత్తున ఉంది. తిప్పారం చెరువు 1,762 అడుగుల (537 మీటర్ల) ఎత్తున వుంది. ఈ వంద అడుగుల వ్యత్యాసం మధ్యలో వున్న ప్రాంతంలో ఏటిగడ్డ కిష్టాపూర్ 1,713 అడుగుల (522 మీటర్ల) ఎత్తున, వేములగట్టు 1,736 అడుగుల (529 మీటర్ల) ఎత్తున వున్నాయి. మరొక పక్కన మాతపల్లి 1,873 అడుగుల (570 మీటర్ల) ఎత్తున కూడ వుంది. గోదావరి మీద 325 అడుగుల (100 మీటర్ల) ఎత్తున వున్న కాళేశ్వరం నుంచి 938 అడుగుల ఎత్తున (285 మీటర్ల) ఎత్తున వున్న మిడ్ మానేరు జలాశయానికి నీళ్లు తెచ్చి, అక్కడి నుంచి మరొక 150 మీటర్లు పైకి ఎక్కించి మల్లన్న సాగర్ నిర్మించాలని ఆలోచిస్తున్నారు. ఏటిగడ్డ కిష్టాపూర్, వేములగట్టుల నుంచి మాతపల్లి దాకా విస్తరించిన పద్నాలుగు గ్రామాలలోని 20,079 ఎకరాల భూమిలో ఈ జలాశయం నిర్మించాలని ఆలోచిస్తున్నారు. ఎం.ఆర్.వో ఆఫీసులో అతికించిన కాగితం ప్రామాణికమే అనుకుంటే, దాని ప్రకారం తొగుట మండలంలోని బ్రాహ్మణ బంజర్ పల్లి, ఏటిగడ్డ కిష్టాపూర్ (తిరుమలగిరి, మొగుళ్లచెరువు

తండాలతో సహా), కొండపాక మండలంలోని తిప్పారం (సింగారంతో సహా), ఎర్రపల్లి, మంగోలు (కాశె గుడిసెలతో సహా), కోనాయపల్లి (వడ్డెరకాలనీతో సహా) గ్రామాల్లో ఇళ్లూ భూములూ అన్నీ ముంపుకు గురవుతాయి. తొగుట మండలం తుక్కాపూర్, తొగుట, ఎల్లారెడ్డిపేట, కొండపాక మండలం మాతపల్లె, మేదినీపూర్, ముద్దారం గ్రామాల్లో భూములు మాత్రం ముంపుకు గురవుతాయి. మొత్తంగా 3,112 ఇళ్లు, 20,079 ఎకరాల భూమి ముంపుకు గురవుతుందని అంచనా.

ఈ ప్రాంతం ఇంత ఎత్తున ఉండడం వల్ల, నీరు పల్ల మెరుగు అన్నట్టుగా, ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు నీరు సహజంగా కాలువల ద్వారా ప్రవహిస్తుందని ప్రాజెక్టు సమర్థకులు అంటున్నారు. అయితే పాత ప్రణాళికలో తడ్కపల్లి చెరువు తర్వాత వున్న తిప్పారం చెరువు తడ్కపల్లి కన్న వంద అడుగుల ఎత్తున, ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న ప్రాంతానికి సగటున యాభై అడుగుల ఎత్తున వుంది. ఎత్తే ప్రధానమైతే తిప్పారం ఎక్కువ యోగ్యమైన స్థలం కావాలి. మల్లన్న సాగర్ ప్రతిపాదిత ప్రాంతం మిడ్ మానేర్ జలాశయం కన్న దాదాపు 900 అడుగుల ఎత్తులో, దాదాపు 70 కిమీ. దూరంలో వుంది. ఈ దూరంలో కొంత భాగం కాలువల ద్వారా, కొంత పైప్ లైన్ల ద్వారా నీరు ప్రవహిస్తుందని అంటున్నారు. కాలువకైనా, పైప్ లైన్ కైనా ఎత్తిపోతలు (లిఫ్ట్) తప్పవు. ఆ ఎత్తిపోతలకు ఎంతో విద్యుత్తు అవసరం అవుతుంది. ఎత్తు నుంచి నీరు పల్లానికి ప్రవహించడం ఎంత సులభమో, కింది నుంచి పైకి తీసుకుపోవడం అంతే కష్టం. అయినా పాత ప్రణాళిక ప్రకారం వంద అడుగుల తక్కువ ఎత్తున వున్నప్పుడు పైకి ఎక్కించవలసిన నీరు 1.5 టి.ఎం.సి. కాగా, ఇప్పుడు వంద అడుగుల ఎత్తూ పెరిగింది. దానితో పాటు 48.5 టి.ఎం.సి. అదనంగా పైకి ఎక్కించవలసిన అవసరమూ వస్తుంది. నీటిని అంత ఎత్తున ఎత్తిపోతలు జరపడానికి అవసరమైన విద్యుదుత్పత్తి ప్రాజెక్టుల గురించి ఇప్పటికైతే సమాచారం లేదు. ఆ విద్యుదుత్పత్తి ప్రాజెక్టులు ఎక్కడ వస్తాయో, వాటి కోసం మరెంతమందిని నిర్వాసితులను చేస్తారో, వాటికి ఎంత ఖర్చవుతుందో, ఆ ఖర్చు కలిపితే నీటి ఖరీదు ఎంత పెరుగుతుందో జవాబు లేని ప్రశ్నలెన్నో వున్నాయి. అన్ని విషయాలూ పాము మంత్రం లాగ రహస్యంగా గుప్పిట్లో పట్టుకుని ఉండడమే మరిన్ని అనుమానాలకు దారి తీస్తున్నది.

ప్రభుత్వం అరకొరగా విడుదల చేస్తున్న లెక్కలలో మరొక అసంగతం కూడా వుంది. మల్లన్న సాగర్ 50 టి.ఎం.సి.ల సామర్థ్యంతో నిర్మిస్తామని, దీనితో మెదక్, నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో లక్షలాది ఎకరాలకు నీరందిస్తామని ప్రభుత్వ నేతలు, సమర్థకులు చెపుతున్నారు. వాస్తవ గణాంకాలు చెప్పే డిపిఆర్ అందుబాటులో లేదు గనుక బొంకరా బొంకరా అంటే టంగుటూరి మిరియాలు తాటి కాయలంత' అనే సామెత లాగ ఎవరి ఇష్టం వచ్చిన గణాంకాలు వారు చెపుతున్నారు. ఈ రిజర్వాయర్ వల్ల ఆరు లక్షల ఎకరాలకు నీరందుతుందని ఒకరు, పది లక్షల ఎకరాలకు నీరందుతుందని మరొకరు, పద్దెనిమిది లక్షల ఎకరాలకు నీరందుతుందని ఇంకొకరు నోటికి వచ్చిన అంకె చెపుతున్నారు. ఒకరైతే తానే కొలిచినట్టుగా, లేదా డిపిఆర్ చూసినట్టుగా పది లక్షల ఇరవై మూడు వేల ఎకరాలు (నయం, అక్కడికి ఆపారు, నాలుగు వందల ఇరవై ఒకటి అని ఆ తర్వాత అంకె కూడ చెప్పలేదు) అని కచ్చితమైన అంకె కూడ ప్రకటించారు.

ఎప్పుడూ ఎక్కడా జలాశయాల్లో చెప్పిన నీటి సామర్థ్యం ఉండదు. ఆవిరి అయిపోవడం, ఇంకిపోవడం అనే నష్టాల వల్ల ప్రకటిత సామర్థ్యంలో 40 శాతం తగ్గించాలని ఏ ఇంజనీరునడిగినా చెపుతారు. అంటే మల్లన్న సాగర్ యాభై టి.ఎం.సి.ల నీటి నిలువ సామర్థ్యం అని చెప్పినా, వాస్తవంగా 30 టి.ఎం.సి.ల కన్న ఎక్కువ ఉండదని అర్థం. అందులోనూ మరొక ప్రభుత్వ సమర్థన వ్యాసంలో రాసినట్టు 10 టి.ఎం.సి.లు పారిశ్రామిక అవసరాల కోసం కేటాయిస్తారని తెలుస్తున్నది. అంటే మొత్తం మీద మల్లన్నసాగర్ కడితే, గడితే దాని నుంచి నీటి పారుదలకు 20-25 టి.ఎం.సి.ల కన్న ఎక్కువ నీరు రావడం అసాధ్యం. ఒక టి.ఎం.సి.తో పదివేల ఎకరాలకు నీరు పారించవచ్చుననేది కూడా ఒక ప్రామాణిక లెక్క. అంటే మల్లన్నసాగర్ నిజంగా కడితే రెండు, రెండున్నర లక్షల ఎకరాల కన్న ఎక్కువ ఆయకట్టు ఏర్పడే అవకాశం లేదు. 'ఇవన్నీ అధిగమిస్తాం రిజర్వాయర్‌లో 50 టి.ఎం.సిలు ఉండేలా, ఆ నీరంతా వ్యవసాయానికే అందేలా చూస్తాం' అని వాగ్దానం చేసినా, 50 టి.ఎం.సి.లతో ఏర్పడబోయే ఆయకట్టు

ఐదు లక్షల ఎకరాలు. మరి ఆరు, పది, పద్దెనిమిది అని ప్రగల్భాలు ఎందుకు, ఎవరిని మోసం చేయడానికి పలుకుతున్నారు? జలాశయం మొత్తం సామర్థ్యంతో వచ్చినా, అదంతా వ్యవసాయానికే వాడినా ప్రభుత్వం చెపుతున్నట్టు, సమర్థకులు నమ్మబలుకుతున్నట్టు భోనగిరి, ఆలేరు వంటి నల్లగొండ జిల్లా ప్రాంతాలకు, కామారెడ్డి, ఎల్లారెడ్డి వంటి నిజామాబాద్ జిల్లా ప్రాంతాలకు, సింగూరు, నిజాంసాగర్ జలాశయాలకు నీరు అందించడం అసాధ్యం, అబద్ధం. మెదక్ జిల్లాలోనే జిల్లా మొత్తం విస్తీర్ణం 23 లక్షల ఎకరాలలో ఐదో వంతు, పదో వంతు భూమికి నీరు ఇవ్వడానికి కూడా మల్లన్న సాగర్ సరిపోదు. అరచేతిలో వైకుంఠం చూపి, చుట్టూ జిల్లాల రైతులను రెచ్చగొట్టి, ఈ ప్రాంత ప్రజల భూములు లాక్కొని, ప్రాజెక్టు పేరుమీద కాంట్రాక్టర్లకు దోచి పెట్టడానికి తప్ప ఈ ప్రాజెక్టు ప్రతిపాదన వల్ల మరే ఉపయోగమూ లేదు. ఈ వాస్తవం తెలియని నిజామాబాద్, నల్లగొండ జిల్లాల రైతులకు అబద్ధాలు చెపుతూ, వారిని రెచ్చగొట్టి మల్లన్న సాగర్ నిర్మాణానికి అనుకూల కుహనా ఆందోళనలు సృష్టించే నీచపు ఎత్తుగడలకు కూడ పాలకులు పూనుకుంటున్నారు.

అలాగే ఎప్పుడైనా నది, ఉపనది, ఏరు, వాగు వంటి నీటి ప్రవాహాల మీద అనుకూలమైన చోట అడ్డంగా ఆనకట్ట కట్టి జలాశయాలు నిర్మిస్తారు. ఇప్పుడు మల్లన్నసాగర్ నిర్మించదలచిన చోట కుడ్లేరు వాగు వుంది గానీ ప్రతిపాదిత జలాశయం దానికి అడ్డంగా కాదు. కాళేశ్వరం నుంచి మధ్య మానేరు మీదుగా కాలువలో లేదా పైప్ లైన్ల ద్వారా వచ్చిన నీటిని నిలువ చేయడానికి మాత్రమే మల్లన్న సాగర్ జలాశయం అంటున్నారు. అంటే ఈ జలాశయానికి మామూలుగా ఒకవైపు ఆనకట్ట కాక, చుట్టూ నాలుగువైపులా కట్టపోయవలసి వుంటుంది. అది ఒక సాంకేతిక సమస్య. ప్రభుత్వం అధికారికంగా సమాచారం బైటపెట్టడం లేదు గనుక అక్కడక్కడా దొరుకుతున్న సమాచారాన్ని కలిపి చూస్తే అరవై మీటర్ల ఎత్తున, 24 కిలో మీటర్ల చుట్టు కొలతతో కట్ట నిర్మిస్తారని తెలుస్తున్నది. ఈ కట్ట నిర్మించాలంటే పదమూడు కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి అవసరమవుతుందని, అంత పెద్ద మొత్తంలో నాణ్యమైన, అవసరమైన మట్టి దొరుకుతుందా అని సాంకేతిక నిపుణులు కూడా సందేహం వ్యక్తం చేస్తున్నారని ఒక పత్రిక రాసింది. పోనీ అలా కట్టినా, అంత ఎత్తున కూడా ఆ ఇరవై వేల ఎకరాల విస్తీర్ణమూ సమతలంగా ఏమీ లేదు. వంద నుంచి నూట యాభై అడుగుల ఎత్తు వంపులు వున్నాయి. అంటే మొత్తంగా అనుకున్నట్టు 50 టి.ఎం.సి.లో 30 టి.ఎం.సి.లో నీరు రాకపోతే మొదట ఆ వంపుల్లో మాత్రమే నీరు నిలుస్తుంది. అంటే ప్రభుత్వం, సమర్థకులు చెపుతున్నట్టుగా, ఆ జలాశయం నిజంగా ఏర్పడినా దాని కింది కాలువలకు నీరు అందుతుందా అనుమానమే.

అంత పెద్ద ఎత్తున 50 టి.ఎం.సి.ల జలాశయం ఏర్పడితే దాని వల్ల భూమి మీద ఒత్తిడి పెరిగి భూకంపాలకు అవకాశం వస్తుందా అని సీస్మిక్ పరిశోధనలు జరపవలసి వుంటుంది. మహారాష్ట్రలో కోయ్నా జలాశయం ఒత్తిడి వల్ల 1967లో భూ కంపం వచ్చి, ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరిగినప్పటి నుంచి, ప్రతి పెద్ద జలాశయం గురించీ ఈ పరిశోధనలు జరగడం తప్పనిసరి అయింది. కానీ మల్లన్న సాగర్ విషయంలో దాని గురించి ఇంత వరకు చర్చే లేదు.

ఇవేవీ లేకుండానే, లేదా బహిరంగంగా ప్రకటించకుండానే 50 టి.ఎం.సి.ల మూడు వేల కోట్ల రూపాయల (మళ్లీ ఈ అంకె కూడ అనుమానమే. ప్రభుత్వ అధికారిక సమాచారం లేదు గనుక మూడు వేల కోట్ల రూపాయల నుంచి తొమ్మిది వేల కోట్ల రూపాయల వరకూ వేరు వేరు అంచనాలున్నాయి) ఇరవై వేల ఎకరాల ముంపు పథకం చాప కింద నీరులా అమలు చేయబోతున్నారు. పెద్ద పెద్ద అంకెలు చూపి భయపెట్టడానికో, కాంట్రాక్టర్లకు మేలు చేయడానికో తప్ప అక్కడ అంత నీటి నిలువ అవసరం లేదు, అవకాశం లేదు, వాస్తవంగా అలా నీరు నిలువయ్యేదీ లేదు. పెద్ద ఎత్తున ఆయకట్టు పెరిగేదీ లేదు. వ్యవసాయానికీ, దుర్భిక్ష ప్రాంతాలకూ నీరు అందించడం పేరుతో భారీ భూ సేకరణ జరిపి, తర్వాత కాలంలో సాంకేతికంగా ఇది సాధ్యమయ్యే ప్రాజెక్టు కాదని చెప్పి, ఏ పది, పదిహేను టి.ఎం.సి.ల ప్రాజెక్టో నిర్మించి ఈ ప్రాంతంలోని కార్పొరేట్ వ్యవసాయ దారులకు, రానున్న పరిశ్రమలకు నీరు అందించే ప్రయత్నం, సేకరించిన భూమిని బహుళ జాతి సంస్థలకు అమ్మే ప్రయత్నం చేసినా ఆశ్చర్యపోనక్కరలేదు.

*(తెలంగాణా ఆత్మ గౌరవ వేదిక ప్రచురణ 'యాభై టిఎంసిల కన్నీళ్ళు' నుండి)*

# కాలువల మీద సాగునీటి రిజర్వాయర్ల అవసరమెప్పుడు?

కొన్ని ప్రాజెక్టు కాలువల మీద రిజర్వాయర్ల అవసరముంటే, మరికొన్నిటిలో ఆ అవసరమే లేదు. ఉదాహరణకు, రిజర్వాయర్లు అవసరమయిన ప్రాజెక్టు, పాలమూరు - రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, ప్రాణహిత - తుమ్మిడి హట్టి (పాత డిజైన్)లయితే, రిజర్వాయర్లు అవసరములేని ప్రాజెక్టు కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్టు అవుతుంది. వీటికి సంబంధించిన సాంకేతిక వివరాలను ఇప్పుడు పరిశీలిద్దాం.

కాలువల మీద రిజర్వాయర్లు ప్రపంచంలో ఎక్కడ కట్టినా సాంకేతిక సూత్రాలు మాత్రం ఒకటే విధంగా వుంటాయి. ముఖ్యంగా అదేమిటంటే "నదిలో బ్యారేజీ ద్వారా నీరు లభించే రోజుల కంటే వినియోగించుకునే రోజులు ఎక్కువైతే, నీరు నిలువ ఉంచుకోవాలి." ఉదాహరణకు పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి, డిండి పథకాలకు కృష్ణా నదిలో లభ్యమయ్యే 120 టీ.ఎం.సీల నీరు 60 రోజులయితే, పంట కాలమంతా 120 రోజులున్నప్పుడు 60 రోజుల నీటి నిలువ అనగా 60 టి.ఎం.సీలను నిలువ ఉంచుకోవాలి. గ్రామాల త్రాగునీరు, నీటి ఆవిరి, ఇనికిపోయే నీరు కలిపి 75 టీ.ఎం.సిల నీరు ప్రాజెక్టులో నిలువ చేసుకోవాలని, ఇప్పుడు తలపెట్టిన స్టోరేజీలు సరిపోవని, నేను ముందే చెప్పినాను. అలాగే ప్రాణహిత - చేవెళ్ల ఎత్తి పోతల ప్రాజెక్టు పాత డిజైన్ తుమ్మిడి హట్టి బ్యారేజీ, కాలువలకు కావలసిన 160 టీ.ఎం.సీల నీరు 90 రోజులు మాత్రమే లభ్యమవుతున్న సందర్భంలో, 120 రోజుల పంట కాలమంతా నీరందించాలి కాబట్టి 30 టీ.ఎం.సీల నీటిని నిలువ చేయాలి. త్రాగునీటి అవసరాలు వగైరా కలిపి ఈ ప్రాణహిత ప్రాజెక్టుకు 75 టీ.ఎం.సీల నిలువ రిజర్వాయర్లుండాలి అని, తలపెట్టిన 16 టీ.ఎం.సీలు సరిపోవని, 2009 ఫిబ్రవరి (ఈనాడు వ్యాసం 2-2-2009) లోనే తెలిపినాను. ఇప్పుడు రీడిజైనింగు చేస్తున్న కాళేశ్వరం ప్రాణహిత ప్రాజెక్టులో, 160 టీ.ఎం.సీల నీటి లభ్యత 120 రోజులైనప్పుడు పంట కాలమంతా అనగా 120 రోజులూ నీటిని వినియోగించుకోవచ్చును. ఈ సందర్భంలో సాగునీటి అవసరాలకు నీరు నిలువ చేయనవసరము లేదు. కాబట్టి రిజర్వాయర్లు అవసరములేదు. కానీ ఇక్కడ కూడా కావలసిన త్రాగునీరు. పరిశ్రమల నీరు. 56 టీ.ఎం.సీల నీరు సంవత్సరము పొడవునా ఇవ్వాలి కాబట్టి, 8 నెలలకు కావలసిన నీటిని నిలువ చేయాలి. ఆవిరి, ఇంకుడు నష్టాలతో కలిపి 45 టీ.ఎం.సీల నీటిని నిలువ చేయాలి. ఈ నిలువలు రిజర్వాయర్ల ద్వారా కాలువ పొడవునా ఎక్కడ అవసరమవుతుందో అక్కడంతా, పెట్టుకోవచ్చును.

30 రోజుల నీటి లభ్యత ఆధారంగా, గోరకల్లు, అవుకు, వెలిగొండ, బ్రహ్మంగారి మఠం రిజర్వాయర్లను, గాలేరునగరి, తెలుగుగంగ ప్రాజెక్టులకు కట్టినారు. అదే విధంగా ఆ రోజుల్లోనే తల పెట్టిన కల్వకుర్తి, నెట్టెంపాడు, మిగులు నీటి ప్రాజెక్టులకు కూడా 90 రోజుల నీటి లభ్యత రిజర్వాయర్లు కట్టినారు. 30 రోజుల నీటి లభ్యతను ఆధారంగా తీసికొని ఈ ప్రాజెక్టుల రిజర్వాయర్లలో కూడా నీటి నిలువలు పెంచాలని 2005 లోనే నేను సూచించాను. ఇక మీదటనైనా ఇలా కల్వకుర్తి, నెట్టెంపాడులకు నీటి నిలువలు పెంచాలి.

"అక్కడ కడితే ఒప్పు, ఇక్కడ కడితే తప్పా" అనే వాదనకు వివరణగా ఈ వాస్తవాలను తెలియజేయడమైనది. సరియైన అధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి, మేలు చేసే పద్ధతులను సూచించడము నా లక్ష్యము. ఇందులో గందరగోళమేమీ లేదు. గతంలో పులిచింతల, పోలవరం ప్రాజెక్టులకు నేనిచ్చిన మేలయిన సూచనలను, ప్రభుత్వం పాటించలేదు. తెలంగాణా నష్టపోయింది. ఇప్పుడిచ్చే ఈ సూచనలు కూడా ప్రభుత్వ విచక్షణమేరకే ఉంటుంది.

- టి. హనుమంతరావు
రిటైర్డ్ ఇంజనీర్ ఇన్ ఛీఫ్ & యు.యన్. కన్సల్టెంట్

# సేంద్రియ పంటలలో కలుపు నివారణ

జి. చంద్రశేఖర్, సుస్థిర వ్యవసాయ కేంద్రం (సి.ఎస్.ఎ)

సేంద్రియంగా పండించే పంటలలో చీడపీడల నియంత్రణతో పాటు కలుపు నివారణ చర్యలు కూడా ముఖ్యమైనవి. కూలీ ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో కలుపు నివారణ సేంద్రియ పద్ధతిలో పండించే పంటలలో ఇంకా ప్రాముఖ్యత సంపాదించుకుంది. ముందు కలుపు గురించి తెలుసుకుందాం.

కలుపు మొక్కకి వివరణలు రకరకాలుగా వున్నాయి. వ్యవసాయరీత్యా కలుపు మొక్క అంటే వుండకూడని చోట వున్న మొక్క. అంటే అది వేరే పంట మొక్క కావొచ్చు, మందు మొక్క కావొచ్చు, పశుగ్రాసంకావొచ్చు, పురుగు లేదా తెగులు నివారించే మొక్క కావొచ్చు. కానీ అది పంట మొక్కలతో పోటీ పడి పంట మొక్కలకు లభ్యమవ్వాల్సిన పోషకాలు, కాంతి, నీరు మరియు జాగా తీసుకుని పెరుగుతుంటే పంట దిగుబడి తక్కువయ్యే అవకాశమున్నందున వీటిని తీసి వేయడం జరుగుతుంది. ముఖ్యంగా పంట మొక్క చిన్నగా వున్నప్పుడు.

**కలుపు మొక్కలలో రకాలు:**

**కలుపు మొక్కలలో ముఖ్యంగా రెండు రకాలు:** ఏక దళ మొక్కలు మరియు ద్విదళ మొక్కలు. ఏక దళ మొక్కలలో గడ్డి జాతి కలుపు మొక్కలు వుంటాయి. అంటే తుంగ, గరిక, ఊదర మొదలగునవి. ఇక ద్విదళ మొక్కలలో వెడల్పాటి ఆకులు కలిగి వున్న రకరకాల మొక్కలున్నాయి. వాటిల్లో వయ్యారి భామ, కసివింద, నేల ఉసిరి, అడివితోటకూర లేదా సిర్రాకు, తగరంచ, వెన్నాద్రి మొదలగునవి ఎక్కువగా పొలాల్లో కనిపిస్తుంటాయి. వీటి నివారణకు క్రింది పద్ధతులు వుపయోగిస్తుంటారు.

1. **చేతితో ఏరి వేయడం :** వరిలో, మిగతా పంటలలో మొదటి నెల, నెలా పదిహేను రోజులకు కలుపు తీత చేస్తారు. ఒక సారి మొక్క పెరిగి విస్తరిస్తోందంటే కలుపు మొక్కలను పెరగనీయకుండా చేసుకోగలదు లేదా కలుపు మొక్కల ప్రభావం అంతగా పంట మొక్క మీద పడదు. అందుకని కూలీలు పెట్టి కలుపు తీయించడం బాగా ప్రాచుర్యంలో ఉన్న పద్ధతి. తుంగ



కైతే భూమి లోపల గడ్డలుంటాయి. అవి ఏరితే మళ్ళీ మళ్ళీ తుంగ మొలకెత్తే సమస్య వుండదు. మనం చేనులో వేసే పెంట ఎరువుతో పాటు చాలా కలుపు మొక్కలు వచ్చే అవకాశముంది. కొన్ని పేడ ద్వారా వస్తే కొన్ని మనం పెంటకుప్ప ఏర్పాటు చేసుకునే ప్రదేశంలో నుండి కూడా వస్తాయి. బయటనుండి పెంటకుప్పలో చేరే కలుపు విత్తనాలు/మొక్కలను కొంచెం అదుపు చేయగలిగితే పెంటఎరువుతో పాటు వచ్చే కలుపులను తగ్గించుకోవచ్చు.


2. **మల్చింగ్:** బారులుగా వేసే మొక్కలలో మొక్కలకు మరియు వరుసల మధ్య దూరం వుంచుతారు కావున అటువంటి పంటలలో వరుసల మధ్య భాగాన్ని ఎందు



గడ్డి లేదా ఎండుటాకులుతో కప్పడం వల్ల సూర్య రశ్మి దొరకక కలుపు మొక్కలు పెరగలేవు. అంతే కాక ఇలా కప్పడం వల్ల వర్షం నేరుగా నేలను గట్టిగా తాకకుండా ఈ కప్పిన పదార్థం పై పడి మెల్లగా నేలలోకి ఇంకే అవకాశం వుంటుంది. మట్టి కొట్టుకు




పోకుండా వుంటుంది. కొంత కాలానికి ఈ కప్పిన సేంద్రియ పదార్థం కూడా కుళ్లి నేలలో కలిసిపోతుంది. ఇంకొకటి లైవ్ మల్చింగ్. అంటే నేల మీద అల్లుకుపోయే గుణమున్న పాదులు లేదా మొక్కలు నేలను కప్పడం కొరకు వుపయోగిస్తారు. ఇవి త్వరగా కప్పడం వలన కలుపు మొక్కలకు సూర్య రశ్మి దొరకక ఎక్కువ పెరగ లేవు.



3. **సోలరైజేషన్:** ఇది ముఖ్యంగా నారు మడులను రోగ కారకాలనుండి మరియు కలుపు మొక్కల నుండి విముక్తం చేయుట కొరకు ఉపయోగిస్తారు. ఇది వేసవిలో మండే ఎండలున్నప్పుడు చేస్తారు. దీనిలో ఒక పారదర్శక పాలీథీలీన్ కవర్‌ను ఎంచుకున్న నారు మడి ప్రదేశంలో కప్పుతారు. దీనిని 4 నుండి 6 వారాల వరకు అలాగే ఉంచుతారు. దీనివల్ల, ఎండవేడికి





కలుపు విత్తనాలు, రోగ కారకాలు, పురుగుల కోశస్థ దశలు మున్నగునవి ఎండ వేడిమికి తాళలేక చనిపోతాయి. ఇవే కాక మిగతా మట్టిలో జీవులు కూడా చనిపోతాయి. దీనివల్ల మొక్కలు వేసుకునేటప్పుడు కలుపు, రోగాలు మొదలైనవి సోకకుండా వుంటుంది.

4. **యంత్రాలు వాడటం:** కలుపు నివారణకు అనేక రకాలైన యంత్రాలు వచ్చాయి. వీటిని వీడర్లు అంటారు. పంటల బట్టి కూడా వీడర్లు వున్నాయి. వరిలో ముఖ్యంగా శ్రీ పద్ధతిలో కోనో వీడర్, రోటరీ వీడర్, మండవ వీడర్ వంటివి మరియు మెట్ట సేద్యంలో సైకిల్ వీడర్, పవర్ వీడర్, బుష్ కట్టర్, పవర్టిల్లర్, కల్టివేటర్ మొదలైనవి ఉపయోగిస్తున్నారు.

కలుపు మందులు సేంద్రియ వ్యవసాయంలో నిషిద్ధం. మరియు పర్యావరణ పరంగా లేదా ఆరోగ్య పరంగా కూడా మంచిది కాదు. కొన్ని కలుపు మొక్కలు పోషక విలువలు కలిగి ఉండి ఆకు కూరలుగా పనికివస్తాయి. ఇటువంటి ఆకు కూరలను పండించని ఆహార పంటలు అంటారు. అటువంటి వాటిలో వెన్నాద్రి, గంజరాకు, సిర్రాకు, తుమ్మి ఇలా చాల మొక్కలు కూరలుగా వాడుకోవచ్చు.



# ముఖ్యమంత్రి జిల్లాలో రైతుకందని పంట రుణాలు కౌలు రైతులదీ అదే పరిస్థితి

బంగారు పంటలకు నిలయంగా మారి మెతుకుసీమగా పేరుగాంచిన మెదక్ జిల్లా రైతాంగం పరిస్థితి నేడు అత్యంత దయనీయంగా మారింది. నేల తల్లిని నమ్ముకుని పంటలు వేస్తే గత రెండు సంవత్సరాలుగా వరుసగా వచ్చిన కరువుతో రైతులు కోలుకోని పరిస్థితికి నెట్టబడ్డారు. కరువు వల్ల వేసిన పంటలు చేతికి రాక, వచ్చిన పంటలకు గిట్టుబాటు రాక పెట్టుబడులే లేకపోయాయి. దీంతో రైతులు బక్కబిక్కి అప్పుల ఊబిలో కూరుకుపోయారు.

గత సంవత్సరం పంట రుణాలు, పంట నష్టపరిహారం, కరువు సహాయం, ఇన్సూరెన్స్ అందక, రైతులు అవస్థల పాలవుతున్నారు. ఇలాంటి దయనీయమైన పరిస్థితిలో తొలకరి పలకరించడంతో పంటలు వేస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, దున్నడం తదితర భారం కావడంతో బ్యాంకులు అందించే పంట రుణాల కోసం ఎదురు చూస్తున్నారు.

ముఖ్యమంత్రి స్వంత జిల్లా కావడంతో నిత్యం వార్తలలో మెదక్ జిల్లానే వుంటుంది. పంట రుణాలు సకాలంలో అందుతాయని నమ్మారు. ముఖ్యమంత్రి జిల్లాకు ఇతర జిల్లాల కంటే రుణాల పరిస్థితితే పెద్ద తేడా లేదని తేలిపోయింది. పంట రుణాలు కూడా అన్ని జిల్లాలలాగే మెతుకు సీమ రైతాంగం సైతం బ్యాంకుల చుట్టూ కాళ్ళరిగేలా తిరుగుతున్నా బ్యాంకర్లు పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తున్నారు. స్వయంగా రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి జూన్ రెండవ వారంలో సమీక్షించినా, జిల్లా కలెక్టర్ సమీక్షలమీద సమీక్షలు చేసినా బ్యాంకర్లు తీరులో అదే నిర్లక్ష్యం కొనసాగుతుంది. విత్తనాలు వేసే సమయం దాటుతుండటంతో ఇక మళ్ళీ ప్రైవేట్ అప్పులే చేయాల్సిన పరిస్థితి దాపురించింది. విత్తనాలు, ఎరువులు సైతం అవసరమైన మేరకు పంపిణీ చేయడంలో, అందుబాటులో వుంచడంలో అధికార యంత్రాంగం విఫలమైంది.

గత ఏడాది ఖరీఫ్‌లో 33 శాతంకు పైగా 2.72 లక్షల హెక్టార్లలో 197.97 కోట్ల విలువైన పంటలు దెబ్బతిన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. దీంతో జిల్లాలో 4,78,421 మంది రైతులకు చెందిన పంటలు చేతి కందలేదు. పంట నష్టపరిహారం అందలేదు.

ఈ ఏడాది 2016-17 ఖరీఫ్ సీజన్‌కు 1,770 కోట్ల రుణాలు ఇవ్వాలని వార్షిక ప్రణాళికలో లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. కానీ లక్ష్యాన్ని నెరవేర్చడంలో బ్యాంకర్లు నిర్లక్ష్యాన్నే ప్రదర్శిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు కేవలం



**పంట రుణాల లక్ష్యాలు (కోట్లలో)**

| సంవత్సరం | లక్ష్యం | పంపిణీ | శాతం |
|---|---|---|---|
| 2011-12 | 781 | 883 | 113.06 |
| 2012-13 | 945 | 1,042 | 110.27 |
| 2013-14 | 1,134 | 1,451 | 127.98 |
| 2014-15 | 1,758 | 1,840 | 104.70 |
| 2015-16 | 2,666 | 1,939 | 72.24 |
| 2016-17 జూన్ 14 నాటికి | 1,770 | 261.9 | |

4,41,334 మంది రైతులకు రూ. 261.9 కోట్ల రుణాలు మాత్రమే అందించగలిగారు. ఇందులో 5,079 మంది కొత్త రైతులకు రూ. 79.12 కోట్లను పంపిణీ చేశారు. 39,255 మంది రైతులకు సంబంధించి రూ. 182.78 కోట్ల రుణాలను రీషెడ్యూల్ చేశారు. జిల్లాలో గత మూడు సంవత్సరాలుగా బ్యాంకర్లు లక్ష్యానికి అనుగుణంగా ఖరీఫ్ రుణాలు పంపిణీ చేయడం లేదని లెక్కలు చూస్తే అవగతమవుతుంది. రుణమాఫీ సొమ్ము జమకాక, రుణ బకాయిలను సాకుగా చూపుతూ బ్యాంకర్లు / రుణాలు రీ-షెడ్యూల్ చేయడంలో ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 31 బ్యాంకులలో ఒక్క పైసా కూడా అందించేలేదు. లీడ్ బ్యాంకు లెక్కల ప్రకారం 13 బ్యాంకులు రూ. 1,763.58 కోట్ల రుణాలు అందించాల్సి వుంది. ఇప్పటి వరకు 261.9 కోట్ల రుణాలు అందించగా గ్రామీణ వికాస బ్యాంకు 179 కోట్ల రుణాలను అందించింది. ఎస్.బి.ఐ., ఎస్.బి.హెచ్. లతో పాటు ఇతర వాణిజ్య బ్యాంకులు మొక్కుబడిగా రుణాలు అందిస్తున్నాయి.

**బ్యాంకుల వారిగా రుణాల పంపిణీ వివరాలు**

| బ్యాంకు పేరు | రైతుల సంఖ్య | మంజూరు చేసిన మొత్తం (కోట్లలో) |
|---|---|---|
| ఎస్.బి.ఐ. | 2,675 | 18.74 |
| ఎస్.బి.హెచ్ | 1,447 | 7.79 |
| గ్రామీణ వికాస బ్యాంకు | 30,079 | 179.4 |
| డి.సి.సి.బి. | 5,975 | 24.63 |
| ఆంధ్రాబ్యాంకు | 2,303 | 14.56 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 792 | 7.68 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 341 | 4.79 |
| యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 411 | 1.56 |
| ఇండియన్ బ్యాంక్ | 152 | 78 లక్షలు |
| అలహాబాద్ బ్యాంక్ | 46 | 46 లక్షలు |
| యూనైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 45 | 34 లక్షలు |
| కెనరా బ్యాంక్ | 30 | 28 లక్షలు |
| పంజాబ్ నేషనల్ బ్యాంక్ | 7 | 27 లక్షలు |
| కోటక్ మహేంద్ర బ్యాంక్ లక్షలు | 12 | 22 |
| యాక్సెస్ బ్యాంక్ | 8 | 4 లక్షలు |
| మొత్తం | 44,334 | 261.9 |

### కౌలు రైతులకు అందని కార్డులు - రుణాలు:

ఇక కౌలు రైతుల పరిస్థితి చూస్తే వారి పట్ల దారుణమైన నిర్లక్ష్యం, వివక్ష కొనసాగుతుంది. భూ అధీకృత కౌలు రైతుల చట్టం 2011 ప్రకారం కౌలు రైతులు పంట రుణాలు, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, బీమా పొందడానికి అర్హులు. అంతే కాకుండా ప్రకృతి విపత్తుల వల్ల కాని, లేదా విత్తనాలు ఇతర కారణాల వల్ల పంట నష్టం అయితే నష్ట పరిహారం పొందేందుకు కౌలు రైతులకు గుర్తింపు, రుణ అర్హత కార్డును పొందే హక్కు వుంది.

ఈ చట్టం సెక్షన్ 4 సబ్ సెక్షన్ 2 ప్రకారం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 1 నుంచి కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించాలి. సెక్షన్ 7 ప్రకారం ప్రతి సంవత్సరం మే 15 నాటికి అంటే ఖరీఫ్ సీజన్‌కు ముందే కౌలు రైతులకు గుర్తింపు కార్డులను మంజూరు పూర్తి చేయాలి. కానీ మెదక్ జిల్లా యంత్రాంగం చట్టంలోని ఆవకాశాలను సాకుగా చూపి జూన్ నెలలో కార్డుల జారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అనేక

అంశాలపై నిత్యం సమీక్షలు చేసే జిల్లా కలెక్టర్, అధికారులు కౌలు రైతుల గుర్తింపు కార్డు, రుణాలపై తమ సంప్రదాయ నిర్లక్ష్యాన్నే కొనసాగిస్తున్నారు.

2016 జూన్ 27న జిల్లా జాయింట్ కలెక్టర్ మొక్కుబడి సమీక్ష చేసి చేతులు దులుపుకున్నారు. డివిజన్ స్థాయిలో అవగాహన సదస్సులతో సరిపెట్టారు. కొన్ని గ్రామాల్లో గ్రామ సభలు పూర్తి చేసి రైతులు ముందుకు రావడం లేదని తమ నిర్లక్ష్యాన్ని రైతులపై నెట్టుతున్నారు. జిల్లాలో 50 వేల వరకు కౌలు రైతులు వుంటారని అధికారుల అంచనాలే చెబుతున్నాయి. కానీ 2016 జూలై 11 నాటికి 982 మంది కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు మంజూరు చేయడం గమనిస్తే ఎంతటి పట్టింపులేని తనం కొనసాగుతుందో చెప్పనక్కర్లేదు. 2013-14లో కేవలం 2009 మందికి కార్డులు జారీ చేయగా 833 మందికి 2.19 కోట్ల రుణాలు అందించారు. 2015-16లో 787 మందికి మాత్రమే కార్డులు జారీ చేశారు. 2016-17 సంవత్సరంలో 5,740 మంది కౌలు రైతులు రుణ అర్హత కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా 104 తిరస్కరించి, కేవలం 982 మందికి మాత్రమే కార్డులు మంజూరు చేశారు. 4,644 మంది దరఖాస్తులను విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజక వర్గంలోని ములుగు మండలంలో 15 దరఖాస్తులు రాగా ఒక్కరికి కూడా కార్డు మంజూరు చేయలేదు. వర్గల్‌లో 154 మంది దరఖాస్తు చేసుకోగా 73 మందికే జారీ చేశారు. గజ్వేల్ మండలంలో 157 మంది దరఖాస్తు చేసుకోగా 34 మందికి జారీ చేసి 15 మందికి తిరస్కరించారు.

జగదేవ్‌పూర్‌లో 99 మంది దరఖాస్తు చేసుకోగా ఒక్కరికి మాత్రమే మంజూరు చేశారు. కొండపాకలో 169 మంది దరఖాస్తు చేసుకోగా 7 తిరస్కరించి 80 మందికి మంజూరు చేశారు. జిల్లాలో నిత్యం బిజీగా కనిపించే మంత్రి హరీష్‌రావు సిద్దిపేట నియోజకవర్గంలో 395 మంది దరఖాస్తు చేసుకోగా 36 మందిని తిరస్కరించి 195 కార్డులు మంజూరు చేశారు. ఇక రాష్ట్ర అంచనా కమిటీ ఛైర్మన్ లింగారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న తొగుటలో 10 మంది, దౌల్తాబాద్‌లో 23 మంది దరఖాస్తులు చేసుకోగా ఒక్కరికి కూడా ఇవ్వలేదు. దుబ్బాకలో 179 మందికిగాను ఇద్దరికి, మిర్‌దొడ్డిలో 92 మంది దరఖాస్తు చేసుకోగా 19 మందివి తిరస్కరించి 32 మందికే కార్డులు మంజూరు చేశారు. కానీ ఒక్కరికి కూడా పంట రుణాలు అందజేసిన దాఖలాలు లేవు.

*- పి. శంకర్*

*దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షులు,*

*రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు*

# సందేహాలు సూచనలు

**రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్న / చేయాలను కుంటున్న రైతులు వివిధ పంటల సస్యరక్షణ విషయంలో తమ సందేహాలను సుస్థిర వ్యవసాయ కేంద్రం (సి.ఎస్.ఎ) కార్యాలయానికి ఫోన్ చేసి, శాస్త్రవేత్తలను అడిగి నివృత్తి చేసుకోవచ్చు.**

*పురుగు మందులు లేని వ్యవసాయం గురించి, పద్ధతుల గురించి, మీ దగ్గర సంపన్నమైన అనుభవాలు వుంటాయి, ఆలోచనలు ఉంటాయి. ఈ పని ఇంకా మెరుగ్గా చేయడానికి సూచనలు, సలహాలు అందిస్తూ 'తొలకరి' కి ఉత్తరాలు రాయండి, వాటిని రాబోయే సంచికలలో ప్రచురిస్తాం.*

## ఫోన్ నెం: 040 - 27017735

# కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి

**కరీంనగర్ జిల్లా** : కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మరియు బ్యాంక్ రుణాల గురించి చర్చించటానికి 22-7-2016న కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం కోరపల్లి మరియు విలాససాగర్ గ్రామాలలో కౌలు రైతులతో సమావేశం కావటం జరిగింది. కోరపల్లి గ్రామంలో 102 మంది కౌలు రైతులు ఉన్నారు. వారికి గత 5 సంవత్సరాలుగా గుర్తింపు కార్డులు వస్తున్నాయి (2014-15 సంవత్సరం మినహాయించి) కానీ బ్యాంక్ రుణాలు ఇవ్వటం లేదని తెలిపారు. గత సంవత్సరం 5 మంది కలిసి గ్రూపుగా తయారు అయినప్పటికీ రుణాలు ఇవ్వలేదని తెలిపారు. దీనికి ప్రధాన కారణం అప్పటికే భూ యజమాని పంట ఋణం పొందటం



వలన బ్యాంక్ వాళ్ళు వీరికి లోన్ ఇవ్వటానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. కౌలు రైతుల గుర్తింపు కార్డు పొందిన రైతులకు ఏ కారణం చేత రుణాలు ఇవ్వటం లేదో తెలుసుకోవటానికి కౌలు రైతులను వెంటబెట్టుకొని జమ్మికుంటలోని బ్యాంక్ మేనేజర్ దగ్గరకు వెళ్ళాము. వాస్తవ సాగుదారులు ఎవరో తెలుసుకోకుండా భూ యజమానులకు పంట రుణాలు ఇవ్వటం అన్యాయం అని రుణ అర్హత గుర్తింపు కార్డు ఉన్న కౌలు రైతులందరికి భూ యజమానుల నుండి ఎటువంటి సమ్మతి పత్రం లేకుండా పంట రుణాలు అందచేయాలని కోరటం జరిగింది. మేనేజర్ గారు కౌలు రైతుల సమస్యలు పూర్తిగా విన్న తర్వాత 2 వారాలలో వీరికి రుణాలు ఇస్తానని ఐతే వీరిని జె.ఎల్.జి గ్రూపులు (జాయింట్ లయబిలిటి గ్రూప్స్)గా అవ్వమని చెప్పారు. తర్వాత ఏ.వో. గారిని కలిసి కౌలు రైతులందరిని జె.ఎల్.జి గ్రూపులుగా చెయ్యమని చెప్పటం జరిగింది. ఈ విషయాన్ని స్థానికంగా వుండే మానవ హక్కుల వేదిక మిత్రుడు ఐలన్న ఫాలో అప్ చేస్తానన్నారు.

తరువాత విలాససాగర్‌లో జె.ఎల్.జి గ్రూపులుగా ఏర్పడి రుణాలు పొందిన కౌలు రైతులతో చర్చించడం జరిగినది.

**నల్గొండ జిల్లా :** నల్గొండ జిల్లా కలెక్టర్ సత్యనారాయణ రెడ్డి గారిని కలిసి కౌలు రైతుల సమస్య మరియు రైతు ఆత్మహత్య కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా అందని విషయాల గురించి రైతు స్వరాజ్య వేదిక బృందం (కిరణ్ విస్సా, జనార్ధన్, నిమ్మయ్య, పిలుపు ఇస్తారి, గ్రామ్య రాము) మాట్లాడటం జరిగింది. ఉదయం 9 గంటలకు కలవటానికి అవకాశం ఇచ్చిన కలెక్టర్ గారు ఒక గంట పాటు కౌలు రైతులు ఎదుర్కుంటున్న సమస్యల గురించి ఫీల్డ్‌లో రెవెన్యూ



అధికారులనుండి ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. వెంటనే జాయింట్ కలెక్టర్‌ను, అదనపు జాయింట్ కలెక్టర్‌ను పిలిపించి మాట్లాడాడు. జిల్లా వ్యవసాయ అధికారితో ఫోన్‌లో మాట్లాడి ఈ సంవత్సరం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, బ్యాంక్ లోనులు ఇవ్వాలని తెలిపారు. భువనగిరి, దేవరకొండ ప్రాంతాల నుండి వచ్చిన కౌలు రైతులు వారి సమస్యలను కలెక్టర్ గారికి వివరించారు. కలెక్టర్‌గారు కౌలు రైతులకు మరియు భూమి యజమానులకు చట్టం గురించి అవగాహన కలిగేవిధంగా ఈ నెల 24 నుండి గ్రామాలలో "కళాజాత"లు నిర్వహించాలని జిల్లా డి.పి.ఆర్.వో గారిని ఆదేశించారు. తర్వాత జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ గారిని కలిసి చర్చించా. కలెక్టర్‌ను కలిసిన వారిలో మానవ హక్కుల వేదిక నుండి జిల్లా అధ్యక్షులు గురువయ్య మరియు ప్రధాన కార్యదర్శి హరిందర్ వున్నారు.

*- నవీన్, బి. కొండల్, రైతు స్వరాజ్య వేదిక*


# పప్పుధాన్యాల పంటల సస్యరక్షణ

## సోయాబీన్

**పురుగులు:**

**చిత్త పురుగులు:**

ఇవి మొక్క లేత దశలో ఆశించి ఆకులలోని పత్రహరితాన్ని తింటూ మొక్కలకు నష్టాన్ని కలుగజేస్తాయి. వీటిని సరియైన సమయంలో నివారించని ఎడల పంట నష్టం ఎక్కువగా ఉంటుంది.



**నివారణ:**


- ❖ చివరి దుక్కిలో ఎకరానికి 100 కిలోల వేపపిండి వేసి కలియదున్నాలి.
- ❖ విత్తనాలను బీజామృతం లేదా బీజరక్షతో విత్తన శుద్ధి చేసుకోవాలి.
- ❖ పురుగు ఉధృతిని బట్టి వేప కషాయం ఒకసారి పిచికారీ చేసుకోవాలి.

**ఆకుముడుత పురుగు:**

ఆకు ముడత పురుగులు ఆకుల పై పొరలోకి తొలుచుకుని పోయి హరిత పదార్థాన్ని తినేస్తాయి. తరువాత ప్రక్కనే ఉన్న ఆకులను మడచి వేస్తాయి. ఒక్కోసారి ఈ పురుగు వలన సోయా చిక్కుడు పంటకు నష్టం ఎక్కువగా ఉంటుంది.

**నివారణ:**

- ❖ 5 శాతం వేప కషాయం లేదా నీమాస్త్రం 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.



**రసం పీల్చు పురుగులు:**

రసం పీల్చు పురుగులు లేత ఆకుల నుండి రసాన్ని పీల్చుతాయి. దీని వల్ల పంట ఎదుగుదల నిలిచి, మొక్కలు క్రమేణా వాడిపోతాయి. రసం పీల్చు పురుగులు వైరస్ తెగుళ్ళను కూడా వ్యాపింపచేస్తాయి.

**నివారణ:**

- ❖ 5 శాతం వేప కషాయం లేదా నీమాస్త్రం 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పంటపై పిచికారీ చేయాలి.
- ❖ ఒక శాతం వేపనూనె పంటపై 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు సాయంత్రం వేళలో పిచికారీ చేయాలి.
- ❖ పొలంలోని కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు నివారించాలి.



## తెగుళ్ళు:

**ఆకుమచ్చ తెగులు:**

ఈ తెగులు సోకిన ఆకులపై గోధుమ రంగులో గుండ్రని చిన్న చిన్న మచ్చలు కనిపించి, క్రమేణా ఈ మచ్చలు పెద్దవై, ఆకులు ఎండి రాలిపోతాయి. దీని వలన కాయలలోని గింజలు సరిగ్గా ఏర్పడవు.

**నివారణ:**

- ❖ 6 లీటర్ల పుల్లని మజ్జిగ ద్రావణాన్ని, 100 లీటర్ల నీటికి కలిపి ఎకరా పొలంలో వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు సాయంత్రం వేళలో పంటపై పిచికారీ చేయాలి.
- ❖ పశువుల పేడ, మూత్రం ద్రావణానికి 200 గ్రాముల ఇంగువను చేర్చి సాయంత్రం వేళలో పంటపై పిచికారీ చేయాలి.



**కుంకుమ తెగులు:**

కుంకుమ తెగులు ఆశించిన ఆకుల పై భాగాన లేత పసుపు వర్ణం గల గుండ్రని చిన్న మచ్చలు ఏర్పడతాయి. తరువాత దశలో ఈ మచ్చలు కుంకుమ రంగును పోలి ఉంటాయి.

**నివారణ:**

- ❖ ఆరు లీటర్లు బాగా పులిసిన పుల్లని మజ్జిగ ద్రావణం (5 - 7 రోజులు) వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- ❖ పశువుల పేడ + మూత్రం + ఇంగువ ద్రావణం 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పంటపై పిచికారీ చేయాలి.

**బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు:**

ఈ తెగులు సోకిన ఆకులపై చిన్న చిన్న గుండ్రని గోధుమ రంగు మచ్చలు ఏర్పడి అనుకూల వాతావరణ పరిస్థితులలో పెద్ద మచ్చలుగా ఏర్పడి ఆకులు ఎండి, రాలిపోతాయి.

**నివారణ:**

- ❖ ఎల్.ఎస్.బి-1, ఎమ్.ఎ.సి.ఎల్-58, పి.కె.-472 రకాలు ఈ తెగులును తట్టుకుంటాయి.
- ❖ ఈ తెగులు నివారణకు కాపర్ఆక్సీక్లోరైడ్ 20 గ్రాముల మందును 10 లీటర్ల నీటిలో కలిపి రెండు సార్లు 10 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

**మొజాయిక్ తెగులు:**

ఇది వైరస్ జాతి తెగులు. ఈ తెగులు సోకిన ఆకులు, కాయల మీద పసుపుపచ్చ పొడలు ఏర్పడతాయి. ఈ పొడల వలన ఆకులు, కాయలు క్రమేణా ఎండిపోతాయి.

**నివారణ:**

- ❖ ఈ తెగులు సోకిన మొక్కలను పీకి తగుల బెట్టడం ద్వారా పైరులోని ఇతర మొక్కలకు వ్యాపించకుండా అరికట్టవచ్చు.
- ❖ తెగులు సోకని మొక్కల నుండి విత్తనం తీసుకోవాలి.
- ❖ ఈ తెగులును వ్యాపింప చేసే పేనుబంక నివారణకు 5 శాతం వేప కషాయం 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పంటపై సాయంత్రం వేళలో పిచికారీ చేయాలి.

## కంది

### ఆకుచుట్టు పురుగు:

కంది పెరిగే దశలో ఆకుచుట్టు పురుగు ఆశిస్తుంది. ఈ పురుగు ఆకులను చుట్టగా చుట్టుకుని ఆకులను తింటుంది. ఈ పురుగు ఉధృతి అక్టోబర్ - నవంబర్ మాసాలలో ఎక్కువగా ఉంటుంది. **నివారణ:** *5 శాతం వేప కషాయం* లేదా *నీమాస్త్రం* వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పంటపై పిచికారీ చేయాలి.

# పశువుల్లో అజీర్తి

పశువుల్లో అజీర్తి నాలుగు రకాలు ఉంటుంది.

**1. సాధారణ అజీర్తి, 2. మేత పేరుకొని పోయిన అజీర్తి, 3. వాయువుతో కూడిన అజీర్తి, 4. విషపూరిత అజీర్తి, ఎ) ఆమ్లజనిత అజీర్తి, బి) క్షారజనిత అజీర్తి**

**1. సాధారణ అజీర్తి**

పాకల్లో ఉంచి మేపే పశువుల్లో కనబడుతుందీ సమస్య. త్రాగునీరు సరిపోయినంత ఇవ్వకపోయినా, పిండి పదార్థాలు ఎక్కువై మాంసకృత్తులు తక్కువైనా, ఆంటిబయోటిక్‌లు వాడినపుడు రుమెన్‌లో ఉపకారజీవులు నశించడం వల్ల ఈ సమస్య సంభవిస్తుంది. పెద్ద పొట్ట కదలికలు స్థంభించిపోతాయి. పశువులు మేత తినవు. మలబద్ధకం, పాలు తగ్గుతాయి. "హిమలయన్ బత్తిసా" వంటి మందుల్ని బెల్లంతో కలిపి 2-3 రోజులు తినిపిస్తే ఈ సమస్య నివారించ బడుతుంది.

**అజీర్తి :** పొట్టలో మేత పేరుకొని పోవడం వల్ల అజీర్తి సంభవిస్తుంది. "సాధారణ అజీర్తి" చికిత్సలాగే ఈ 'అజీర్తి'కి కూడా చికిత్స చేయాలి.

**వాయువుతో కూడిన అజీర్తి (కడుపు ఉబ్బరం / టింపనీ)**

పశువుల పొట్టలోని రుమెన్, రెటికులమ్‌లలో గానీ చేరడం వల్ల కడుపు ఉబ్బరం సంభవిస్తుంది. పొట్టల అరల్లో అధికంగా గాలి ఉత్పత్తి అవడం లేదా గాలి బయటకి వెళ్ళకుండా అడ్డుపడడం వల్ల ఈ విధంగా జరుగుతుంది.

**కారణాలు:** పప్పుజాతి పశుగ్రాసాలు అధికంగా సంగ్రహించడం, ఎక్కువ ధాన్యపు గింజలున్న ఆహారం సంగ్రహించడం, పీచు పదార్థం (వరి గడ్డి) తక్కువగా తీసుకోవడం, ఆహారంలో ఆకస్మిక మార్పు, పొట్టలో కదలికలు తగ్గడం, కుళ్ళిన చపాతి, అన్నం సంగ్రహించడం వల్ల అధికంగా వాయువు ఉత్పత్తి అయి కడుపు ఉబ్బరం సంభవిస్తుంది. దీనిని "ప్రైమరీ టింపనీ" అంటారు. దీంట్లో వాయువు, నురగ కలసి ఉంటుంది. ఈ రకం వ్యాధి తీవ్రంగా ఉంటుంది. గొంతులో అడ్డుపడడం, హెర్నియా, ధనుర్వాతం, అలెర్జీ, పాలజ్వరం, రుమెన్‌లో కదలికలోపించడం వల్ల, ఒక ప్రక్కకు పడుకోవడం వల్ల వాయువు బయటకు వెళ్ళలేకపోతుంది. దీనిని "సెకండరీ టింపనీ" అంటారు. వాయువు మాత్రమే పొట్టలో ఉంటుంది. వ్యాధి దీర్ఘకాలికంగా ఉంటుంది.

**లక్షణాలు:** పశువుల పొట్ట ఎడమ ప్రక్క నురుగుతో లేదా నురుగు లేకుండా వాయువుతో నిండిపోతుంది. మేత తినవు. నీరసంగా ఉంటాయి. కడుపునొప్పి, పళ్ళు కొరకడం, కడుపు తన్నుకోవడం, నేలపైపడి తన్నుకోవడం, శ్వాస కష్టంగా పీల్చడం, శ్వాస, గుండె వేగంగా ఉండడం, మ్యూకస్ పొరలు పచ్చగా మారడం, కడుపులో కదలికలు పెరుగుతాయి. తరుచుగా మూత్రం, విరోచనాలవుతాయి. పొట్టలో వాయువు పీడనం ఎక్కువైతే మరణం సంభవిస్తుంది.

**చికిత్స:** ఇది ప్రమాదకమైనందున వెంటనే వైద్యుల్ని సంప్రదించాలి. నోటి నుంచి జీర్ణశయానికి ట్యూబ్‌ను పంపి నోటి ద్వారా గ్యాస్ తీసివేయాలి. పొట్టలో వాయువు తీవ్రంగా ఉంటే ఎడమ డొక్క నుంచి నీడిల్‌తో వాయువు తొలగించాలి. నీళ్ళ, మేత ఇవ్వకూడదు. నువ్వుల నూనె లేదా వేరుశనగ నూనె రోజుకు150 మి.లీ. చొప్పున మూడు రోజుల పాటు మాత్రమే త్రాగించాలి. పరిస్థితి తీవ్రంగా ఉంటే పొట్టలోనే ఇంజెక్ట్ చేయాలి. బ్లోటిల్, బ్లోటోకేర్, అపానిల్, టింపాల్ వంటి మందుల్ని 40 మి.లీ. త్రాగించాలి. లేదా లిక్విడ్ పారాఫిన్ 500 మి.లీ. త్రాగించాలి.

**ఆమ్లజనిత అజీర్తి:** జొన్న, వరి, గోధుమలు, మొక్కజొన్న వంటి ధాన్యపు గింజల్ని ప్రమాదవశాత్తు ఎక్కువగా సంగ్రహించడం వల్ల ఆమ్లజనిత అజీర్తి సంభవిస్తుంది. ఈ గింజల ద్వారా లభ్యమయ్యే పిండి పదార్థాలు త్వరగా ఫర్మెంట్ అవటం వలన పశువులకు విషపూరితమవుతుంది. బలహీనత, రుమెన్ కదలికలు కోల్పోవడం, ఒక ప్రక్కకు పడుకుని వుండడం, డిహైడ్రేషన్ మొదలగు లక్షణాలు వుంటాయి. మరణాల శాతం అధికంగా ఉంటుంది. అలాగే తినగా మిగిలిన చపాతీలు, అన్నం, ఆపిల్, ద్రాక్షలు మొదలగు పదార్థాలు సంగ్రహించడం వల్ల కూడా ఈ సమస్య సంభవిస్తుంది. గింజల్ని కిలో శరీర బరువుకు 25-60 గ్రా.లు సంగ్రహిస్తే

చాలు, పశువుల్లో ఆమ్లజనిత అజీర్తి సంభవిస్తుంది. తీవ్రదశలో రుమెన్ పి.హెచ్. 4 నుంచి 5 వరకు ఉంటుంది.

**లక్షణాలు:** పశువులు మేత తినవు. నెమరు వేయవు. పశువుల రుమెన్లో కదలికలుండకపోవడం, కడుపు నొప్పి, పళ్ళు కొరకడం, విరోచనాలు నల్లగా, గట్టిగా ఉండి, మ్యూకస్‌తో కలిసి ఉంటాయి. మూత్రం స్తంభిస్తుంది. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయి కంటే తగ్గుతుంది. పాలజ్వరంలో లాగా పశువు పడుకుంటుంది. పశువుల కళ్ళు లోతుకుపోయి, ముట్టె తడి ఆరి, చర్మం సున్నితత్వం కోల్పోతుంది. డీహైడ్రేషన్‌కు గురి అవుతాయి.

**చికిత్స:** రుమెన్ పి.హెచ్. సరిచేయడానికి సోడాబైకార్బ్ / మాగ్నిసియం ఆక్సైడ్ త్రాగించాలి.

**క్షార జనిత అజీర్తి:** వేసవిలో చాలా ప్రాంతాల్లో పశుగ్రాసాల కొరత వలన ప్రధాన వ్యవసాయోత్పత్తి అయిన వరిగడ్డిని ఎక్కువగా, చాలా కాలం మేపుతుంటారు. వరిగడ్డిలో పీచు పదార్థం తప్ప, పోషక పదార్థాలేమీ లభ్యం కానందున, పశువులకు క్రమంగా దీనిని మేపడం వల్ల పశునాణ్యత తగ్గి, బక్కచిక్కిపోతాయి. పశువుల్లో ఉత్పాదకత శక్తి తగ్గిపోతుంది. అంతే కాకుండా వరిగడ్డిని చాలా కాలం పశువులకు మేపడం వల్ల క్షారజనిత అజీర్తి సంభవిస్తుంది.

**లక్షణాలు పరిశీలిస్తే...**

రెగ్యులర్‌గా వరి గడ్డిపై ఆధారపడి మేసే పశువుల పొట్ట (రుమెన్)లో సాధారణంగా ఉండే పి.హెచ్. 7.5 నుంచి 9.5 వరకు పెరుగుతుంది. రుమెన్‌లో సూక్ష్మజీవుల సంఖ్య తగ్గిపోతుంది. తద్వారా ఆకలి మందగిస్తుంది. పశువులు నెమరు వేయవు. రుమెన్ కదలికలు తగ్గిపోతాయి. పొట్టలో గాలి తయారవడం వల్ల పొట్ట ఉబ్బరంగా ఉంటుంది. పలుచటి విరోచనాలు అవుతాయి. నోటి వెంట చొంగ, కళ్ళ వెంట నీరు కారుతుంది. శ్వాస, నాడీ వేగం పెరుగుతుంది. పశువులు కడుపునొప్పి వల్ల వెన్ను విరుస్తూ పొట్టను కాళ్ళతో తన్నుకుంటాయి. పశువులు పక్కకు పడిపోవడం, వణుకు, ఫిట్సు, లక్షణాలతో మరణిస్తాయి. పాలల్లో కొవ్వు శాతం తగ్గుతుంది. వ్యాధి గ్రస్త పశువు రుమెన్ ఫ్లూయిడ్ రంగు అమ్మోనియా వాసన కలిగి ఉంటుంది. చికిత్సకు పశువులకు 10 శాతం అసిటిక్ ఆసిడ్, 5 నుంచి 10 మి.లీ. లేదా లాక్టిక్ ఆసిడ్ 50 మి.లీ. నీటితో కలిపి త్రాగించవచ్చు. దీని వల్ల క్షారపరిమితి తగ్గి, రుమెన్‌లో ఉదజని సూచిక సాధారణ స్థాయికి వస్తుంది. అవసరాన్ని బట్టి రింగర్ లాక్టేట్, గ్లూకోజ్, కాల్షియం, మెగ్నిషియం ఖనిజలవణాల్ని వాడాలి. ఆరోగ్యమైన పశువుల నోటి నుంచి నెమరు పదార్థాల్ని తీసి నీళ్ళతో కలిపి వ్యాధి గ్రస్త పశువులకు త్రాగించాలి.

**వివిధ రకాల అజీర్తి - నివారణ:**

1. పిండి పదార్థాలున్న ధాన్యాన్ని 8 కిలోలు పశువులు సంగ్రహిస్తే 24 గంటలలో అవి మరణిస్తాయి. కాబట్టి జాగ్రత్తగా ఉండాలి. ధాన్యాలను నలగగొట్టి పెట్టాలి. కానీ పిండి చేసి పెట్టకూడదు.
2. పప్పుజాతి పశుగ్రాసాలను, సమీకృత దాణాను ఎక్కువ పరిమాణంలో, ఒకేసారి పెట్టకూడదు.
3. పశువులకు రెగ్యులర్‌గా వరిగడ్డిని మాత్రమే మేపకూడదు. యూరియాను పరిమితి మించి పెట్టకూడదు. కుళ్లిన, పులిసిన గడ్డిని, ఆహార పదార్థాల్ని పశువుల కందించకూడదు.
4. ఎండు మేత, ఆ తర్వాత పచ్చిమేత, నీరు అందించాలి. 50 గ్రాముల ఉప్పు అందివ్వాలి.
5. మేతలో ఆకస్మాత్తుగా మార్పు చేయకూడదు. మేత తినేముందు, తిన్న తర్వాత వెంటనే నీళ్ళు త్రాగనీయకూడదు.
6. వేసవిలో దాహంతో వున్న పశువులు నిలువ వున్న కలుషితమైన మురుగునీరు త్రాగకుండా జాగ్రత్త వహించాలి. పరిశుభ్రమైన త్రాగు నీరు అన్ని వేళలా అందుబాటులో వుంచాలి.
7. లేత జొన్నలో వున్న నాము / ఉంగిడి ప్రభావం వుండకుండా పశుగ్రాసాన్ని పూతదశ మీద కోసి మేపాలి.
8. తరచుగా పొట్ట ఉబ్బరం సమస్య ఎదురైతే, మేత మీద 100 మి.లీ. వంట నూనె చిలకరించాలి. సమస్య తీవ్రంగా ఉంటే పొట్టలోనికి వేరుశనగ / నువ్వుల నూనె నేరుగా ఇవ్వాలి.

# వివిధ పండ్ల తోటల పెంపకంలో మేలైన పద్ధతులు

## మామిడి :

### మొక్కలు నాటటానికి అనువైన కాలం:

మామిడి మొక్కలను జూన్ నుండి డిసెంబర్ వరకు నాటవచ్చు. మొక్కలు త్వరగా నాటుకొని అభివృద్ధి చెందటానికి తక్కువ వర్షపాతం గల ప్రాంతాల్లో జూన్ – జులైలోను, ఎక్కువ వర్షపాతం గల ప్రాంతాల్లో అక్టోబర్ – నవంబర్ మాసాల్లోను నాటుకోవాలి.

### నేలను తయారు చేయటం:

వడగాల్పులు, పెనుగాలులు వీచే ప్రాంతాల్లో సరుగుడు, యూకలిప్టస్ మరియు ఎఱ్ఱ చందనం మొదలైనవి గాలులు వీచే దిశలో రెండు వరుసల్లో 2 మీటర్ల ఎడంలో నాటాలి.

నేలను 2 లేక 3 సార్లు బాగా దున్ని, చదును చేసి 1×1×1 మీటర్ల గుంతలు తవ్వాలి. మొక్కల్ని గుంతల్లో నాటటానికి ముందు 50 కిలోల బాగా చివికిన పశువుల ఎరువు, త్రవ్విన మట్టిలో కలిపి గుంతలను నింపి, 7-10 మీటర్ల దూరాన నాటాలి. బాగా సారవంతమైన నేలల్లో 12 మీటర్ల దూరంలో కూడా నాటుకోవచ్చు.

### మామిడి అంట్ల ఎంపిక:

చీడపీడలు ఆశించని వెనీర్ గ్రాఫ్టింగ్ అంట్లను మాత్రమే నాటుకోవాలి. వేరుమూలం మరియు సయాన్ బాగా అతికి ఉండాలి. అంట్లను నాటేటప్పుడు కొత్త చిగుళ్ళు వేరు మూలంపై ఉండరాదు. అంటుకట్టిన భాగం భూమిపై నుంచి 20 సెం.మీ. ఉండి అంటు పై భాగం పచ్చగా ఆరోగ్యంగా వుండాలి. అంట్లు ఒకటి నుంచి ఒకటిన్నర సంవత్సరం వయసు కలిగి ఉండాలి.

### మొక్కలు నాటటం:

అంటు మొక్కను మట్టిగడ్డతో సహా తీసి వేర్లు కదలకుండా గుంత మధ్యలో నాటి, మట్టితో గట్టిగా నొక్కి గాలికి పడిపోకుండా చిన్న కొయ్యపాతి కదలకుండా కట్టాలి. నాటిన వెంటనే 1.5 అడుగుల వెడల్పు పాదులు చేసి నీరు ఇవ్వాలి. తర్వాత 8-10 రోజుల కొకసారి వర్షాలు లేనపుడు నీరు పోసి కనీసం 2 సంవత్సరాల వరకు కాపాడాలి.

### అంతర పంటలు:

లేత తోటల్లో కూరగాయలు, తక్కువ ఎత్తు ఎరిగే పైర్లు, ఫాల్సా, బొప్పాయి లాంటి పండ్ల తోటలను మిశ్రమ పంటలుగా వేసుకోవచ్చు. అంటు మొక్కలు ఎదిగే వరకు కాయగూరలు, పెసలు, అలసందలు వంటి అంతర పంటలు వేసుకోవాలి. పెద్ద తోటల్లో నీడలో పెరిగే అల్లం, పసుపు పైర్లను వేసుకోవచ్చు. నేలను త్వరంగా నిస్సారం చేసే మొక్కజొన్న, చెఱకులను, పిండి పురుగు ఎక్కువగా ఆశించే కందిని, జింక్ మరియు పొటాష్ లోపాలను పెంచే నేపియర్ గడ్డిని అంతర పంటలుగా పెంచరాదు.

### నీటి యాజమాన్యం:

చిన్న మొక్కలకు 6 నెలల వరకు 3 రోజులకోసారి నీరు పెట్టాలి. కాపుకు వచ్చిన చెట్లకు పూత, పిందె దశల్లో నీటి ఎద్దడి రాకుండా నీరు పెట్టాలి. మామిడి తోటలకు కాయ పెరిగే దశలో కనీసం రెండుసార్లు అంటే పిందె ఏర్పడిన తర్వాత 25-30 రోజులకు ఒకసారి, నెల రోజుల తర్వాత మరోసారి నీరు కట్టి, కాయలు కోయటానికి 25-30 రోజుల ముందు నీరు పెట్టటం ఆపివేయాలి. మామిడి కోత తరువాత వెంటనే ఒకసారి నీరుకట్టాలి. వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడితే వేరుకుళ్ళు తెగులు ఉధృతి చెంది తోటంతా దెబ్బతింటుంది.

డ్రిప్ నీటి పారుదల పద్ధతి కొత్తగా నాటిన తోటలకు, కాపుకాసే తోటలకు అనుకూలమైనది. ఈ పద్ధతిలో నీరు వృధా కాదు కావున మామూలు నీటి పారుదల పద్ధతిలో పారించే విస్తీర్ణం కన్నా 3 లేక 4 రెట్లు ఎక్కువ విస్తీర్ణాన్ని పారించవచ్చు. ఈ పద్ధతి వలన నీటి వాడకంలో పొదుపు జరిగి, చెట్లు బాగా పెరిగి ఎక్కువ దిగుబడినిస్తాయి.

చెట్ల పాదుల్లో ఎండుగడ్డి, ఎండిన ఆకులు, వరి పొట్టు, వేరుశనగ పొట్టు వంటివి వేస్తే భూమిలోని తేమ ఆవిరైపోకుండా సంరక్షింపబడుతుంది. భూమి వేడిని, కలుపు మొక్కల పెరుగుదలను తగ్గిస్తాయి. వేసిన కొద్దికాలం తర్వాత కుళ్ళి ఎరువుగా మారుతాయి. ప్లాస్టిక్‌ను కూడా మల్చ్‌గా వుపయోగించవచ్చు.

**చీనీ, నిమ్మ మొక్కల ఎంపిక:**

చీనీలో రంగపూర్ నిమ్మపై కట్టిన వైరస్ తెగుళ్ళులేని అంట్లను, నిమ్మలో మొలకలు లేదా రంగపూర్ నిమ్మపై కట్టిన అంట్లను ఎన్నుకోవాలి.

**అంట్ల ఎంపికలో మెళకువలు:**

వేరు మూలంపై 15 సెం.మీ. ఎత్తులో కట్టిన అంట్లను ఎన్నుకోవాలి. అంటు కట్టిన తరువాత 6-10 నెలల వయస్సుగల అంట్లను ఎన్నుకోవాలి. మొజాయిక్, గ్రీనింగ్, ట్రిస్టిజా మొదలైన వెర్రి తెగుళ్ళు లేని అంట్లను ఎన్నుకోవాలి. కణువుల మధ్యదూరం దగ్గరగా ఉండి, ఆకుల పరిమాణం మధ్యస్థంగా వున్న అంట్లు నాణ్యమైనవి. ముదురు ఆకు దశలో వున్న అంట్లను ఎన్నుకోవాలి.

**అంట్లు నాటే సమయంలో జాగ్రత్తలు:**

అంట్లు నాటేటపుడు అంటు భాగం నేల మట్టం నుంచి 15 సెం.మీ. ఎత్తులో ఉండాలి. సాయంత్రం వేళల్లో అంట్లు నాటాలి. నాటిన అంట్ల ప్రక్కన కర్ర నాటి ఊతం ఇవ్వాలి. చీని, నిమ్మ మొక్కలను 6×6 మీటర్ల దూరంలో నాటాలి. సారవంతమైన నేలల్లో 8×8 మీ. దూరంలోనూ నాటుకోవచ్చు. మొక్కలను నాటడానికి ఒక నెల రోజుల ముందే 1×1×1 మీటరు సైజు గుంతలను త్రవ్వి ఆరబెట్టాలి. ప్రతి గుంతలోనూ పై పొర మట్టితో పాటు 40 కిలోల పశువుల ఎరువు, ఒక కిలో సూపర్‌ఫాస్ఫేటు, 100 గ్రాములు పది శాతం లిండేను పొడివేసి కలిపి నింపాలి.

**జామలో ప్రవర్ధనం, నాటే సమయం:**

నేల అంట్లు గాని, అంట్లు గాని నాటుకోవచ్చు. జామ మొక్కలను జూన్ - జులైలోగాని, అక్టోబర్ - నవంబర్ మాసాల్లో గాని నాటుకోవాలి.

**నీటి యాజమాన్యం:**

లేత మొక్కలకు 2-3 రోజులకొకసారి, పెరిగిన చెట్లకు 7-10 రోజుల కొకసారి నీరు పారించాలి. నీటి పళ్ళాల పరిధి చెట్టు పెరుగుతున్న కొలది ఏడాదికి అర్ధ అడుగు చొప్పున పెంచాలి. డ్రిప్ పద్ధతి ద్వారా నీరు పారించడం మంచిది.

**మొక్కలు నాటుట:**

జామను సాధారణంగా నేల అంటు పద్ధతి లేదా చెర్పంటు పద్ధతులలో ప్రవర్ధనం చేస్తారు. మొక్కల మధ్య దూరాన్ని నేల లోతు, భూసారం సాగునీటి సౌకర్యం మొదలైన అంశాలను బట్టి నిర్ణయించాలి. మొక్కలను 5×5 మీ. (160 మొక్కలు ఎకరాకు) లేదా 6×6 మీ (112 మొక్కలు ఎకరాకు) దూరంలో నాటవచ్చును. 60×60×60 ఘ.సెం. పరిమాణం గల గుంతలను తయారు చేసి, ప్రతి గుంతకు 10-15 కిలోల పశువుల ఎరువు, అందించాలి.

**దానిమ్మలో ప్రవర్ధనం:**


దానిమ్మను నేల అంట్లు, గాలి అంట్ల లేదా కొమ్మల కత్తిరింపుల ద్వారా ప్రవర్ధనం చేయవచ్చు. మంచి దిగుబడినిచ్చే ఆరోగ్యవంతమైన చెట్లనుంచి కొమ్మలను కత్తిరించాలి. ఒక సంవత్సరం వయస్సున్న ముదురు కొమ్మలను 9-12 అంగుళాల పొడవు గల ముక్కలుగా కత్తిరించి నాటుకోవాలి. మొక్కల మొదలు నుంచి వచ్చే కొమ్మ కత్తిరింపులు నాటుకుంటే ఎక్కువగా సఫలమవుతాయి. కత్తిరించిన కొమ్మల అడుగు భాగాన్ని సెరడిక్స్ పౌడర్‌తో అద్ది 4-6 కణువులు భూమిలో ఉండేలా నాటుకుంటే వేర్లు తొడిగే అవకాశం ఎక్కువ. ఆరునెలల కంటే తక్కువ 18 నెలల కంటే ఎక్కువ వయసున్న కొమ్మలను కత్తిరింపుల కోసం ఎన్నుకోరాదు. వేర్లు తొడిగిన కత్తిరింపులు 9 నెలల్లో నాటుటకు అనువుగా ఉంటాయి. వర్షాకాలం ప్రారంభంలో గాలి అంట్లను ప్రవర్ధనం చేస్తే ఎక్కువ వేర్లు తొడిగే అవకాశం ఉంటుంది. గాలి అంట్లలో 25-30 రోజుల్లో వేర్లు తొడిగి 3 నెలలకు నాటుటకు అనువుగా వుంటాయి.

**నాటటం:**


రకం, నేల స్వభావం, వాతావరణం పరిస్థితులను బట్టి 4.5 మీ × 3.0 మీ. లేదా 4 మీ × 4 మీ. దూరాన్ని నిర్ణయించుకోవాలి. డ్రిప్ పద్ధతిలో నీరు పెట్టడానికి అవకాశం ఉంటే జూన్ నుంచి మార్చి వరకు నాటుకోవచ్చు. 60×60×60 సెం.మీ. గుంతలు తీసి నెల రోజుల వరకు గుంతలను సూర్యరశ్మికి ఆరనివ్వాలి. తర్వాత ప్రతి గుంతకు 20 కిలోల పశువుల ఎరువు, 2 కిలోల వానపాముల ఎరువు, 3 కిలోల వేపపిండి, 25 గ్రాముల ట్రైకోడెర్మా పొడిని, 15 గ్రాములు పాస్ఫోబాక్టీరియా పొడిని మరియు 15 గ్రాముల అజటోబాక్టర్‌ను మట్టితో కలిపి గుంతలు నింపాలి.

('ఉద్యాన పంచాంగం' ఆధారంగా)

# రైతు స్వరాజ్య వేదిక వాలంటీర్ 'బి. కొండల్'కు బాషామెమోరియల్ అవార్డు



గత దశాబ్ద కాలంలో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కుటుంబాల సంక్షేమం కోసం, ముఖ్యంగా రైతు బలవన్మరణాల బాధిత కుటుంబాలకు న్యాయం అందేలా చూసేందుకు, ఆయా కుటుంబాలలోని పిల్లల చదువులు ఆగిపోకుండా చేసేందుకు, తన సహచరులతో కలిసి నిర్విరామంగా కృషి చేస్తున్న **రైతు స్వరాజ్య వేదిక వాలంటీర్ బి. కొండల్** బాషా మెమోరియల్ అవార్డు అందుకున్నారు. విశాఖపట్నం జిల్లా, అనకాపల్లి కేంద్రంగా పని చేస్తున్న బాషా మెమోరియల్ ట్రస్ట్, ప్రజల కోసం పని చేసే యువ వాలంటీర్లకు ప్రతి సంవత్సరం బాషా మెమోరియల్ అవార్డును అందిస్తున్నది. 2015-16 సంవత్సరానికి గాను బి. కొండల్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ అవార్డు ప్రదానోత్సవం జులై 17న అనకాపల్లిలో జరిగింది. ప్రొఫెసర్ హరగోపాల్, రచయిత్రి మల్లీశ్వరి, రైతు స్వరాజ్య వేదిక నాయకులు విస్సాకిరణ్ కుమార్, 'సమాలోచన' చక్రి, ఎ.పి.వి.వి.యు నాయకులు పి.ఎస్. అజయ్ కుమార్ అతిథులుగా హాజరైన సభలో బి. కొండల్‌కు ఈ అవార్డును అందించారు.



**పెళ్లికి ఎంత ఖర్చు అవుతుందో**
**ఆ డబ్బు మొత్తం**
**రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలకు**
**సహాయంగా ఇచ్చారు.**

## సింపుల్‌గా రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు

అభరు దివారే... ఇటీవలే ఇండియన్ రెవిన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్)కి ఎంపికయ్యాడు. నాగ్‌పూర్ బేస్‌డ్ నేషనల్ అకాడమీ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ (ఎన్ఎడీటీ)లో ట్రైనింగ్‌కు వెళ్లనున్నాడు. ప్రీతి కుంభారే... ఐడీబీఐ ముంబై బ్రాంచ్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నది. ఇద్దరూ యుపిఎస్‌సి, యంపిఎస్‌సి పరీక్షల కోసం సన్నద్ధమవుతుండగా పరిచయమయ్యారు. ఆ పరిచయం కాస్తా ప్రేమకు దారి తీసింది.

ఇద్దరూ అమరావతిలోని అభియంత భవన్‌లో పెళ్ళి చేసుకున్నారు. ఆ పెళ్లిలో బాజాభజంత్రీలు లేవు. హంగులు, ఆర్భాటాలు అసలే లేవు. చాలా సాదాసీదాగా.. ఒక్కటయ్యారు. అయితే పెళ్లికయ్యే ఆ ఖర్చునే మరో విధంగా వుపయోగించాలనుకుంది ఆ జంట. ఆత్మహత్యలు చేసుకున్న పది రైతు కుటుంబాలను ఎంచుకుని ఒక్కో కుటుంబానికి 20 వేల చొప్పున సహాయం అందించారు. అంతేకాదు, 52 వేల విలువ చేసే వివిధ పోటీ పరీక్షల పుస్తకాలను అమరావతిలోని ఐదు లైబ్రరీలకు ఇచ్చారు.


అయితే ఈ డబ్బంతా వాళ్ల తల్లిదండ్రుల దగ్గర నుంచి తీసుకోలేదు. అమ్మాయి, అబ్బాయి ఇద్దరూ కష్టపడి సంపాదించిన సొమ్మునే ఇలా వివిధ పనులకు వుపయోగించారు. విందులో కూడా చపాతి, అన్నం, పప్పు, కూరగాయలు మాత్రమే వడ్డించారు. సింపుల్‌గా స్టేజ్‌పై రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు.

# రూపుదిద్దుకుంటున్న సుస్థిర వ్యవసాయ క్షేత్రం

వరంగల్ జిల్లా లింగాలఘనపురం మండలం, ఏనబావి, మాణిక్యాపురం, కళ్ళెం, సిరిపురం, జీడికల్ గ్రామాలలో సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తూ రైతులతో కలిసి సుస్థిర వ్యవసాయ కేంద్రం (సి.ఎస్.ఎ) పని చేస్తున్నది. రైతులు తాము పండిస్తున్న పంటలను నేరుగా అమ్ముకుని లబ్ది పొందేలా సేంద్రియ రైతుల సహకార సంఘాలను నిర్మించుకునేందుకు సంస్థ సహకరించింది. ప్రస్తుతం ఈ 5 గ్రామాల పరిధిలో ఏనబావి సేంద్రియ రైతుల సహకార సంఘం, ఆదర్శ సేంద్రియ రైతుల సహకార సంఘం ఏర్పడి పని చేస్తున్నాయి. ఈ రెండు సహకార సంఘాలూ **"సహజ ఆహారం ప్రొడ్యూసర్ కంపెనీ"**లో భాగస్వాములుగా వున్నాయి.




ఈ ప్రాంత పరిధిలో "సుస్థిర వ్యవసాయం"పై కృషిని మరింత ప్రోత్సహించేందుకు, సేంద్రియ, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై పరిశోధనలను మరింత విస్తృతపరిచేందుకు, గ్రామీణ ప్రాంత సన్న, చిన్న కారు, మధ్య తరగతి రైతులకు సుస్థిర వ్యవసాయం, ఇతర జీవనోపాధులపై శిక్షణ ఇచ్చేందుకు వీలుగా సి.ఎస్.ఎ. సంస్థ **కళ్ళెం గ్రామ పంచాయితీ** పరిధిలో 3 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. సి.ఎస్.ఎ.లో పని చేస్తున్న శాస్త్రవేత్తలు, ఇతర టీం సభ్యులు, మరి కొందరు సంస్థ సన్నిహితులు కలసి మరో ఐదున్నర ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఈ మొత్తం ఎనిమిదిన్నర **ఎకరాల** క్షేత్రానికి **"గ్రీన్ దునియా ఫామ్"**గా పేరు పెట్టారు. ఈ క్షేత్రంలో ఈ సంవత్సరం ఏప్రిల్ నుండీ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి.



**పంటల సాగు:**

క్షేత్రంలో అర ఎకరం విస్తీర్ణంలో తీగజాతి కూరగాయల కోసం పందిరి వేశారు. బీర, సొర, కాకర తీగలు పాకి, పిందె దశలో వున్నాయి. దోస, చిక్కుడు, వంగ, టమాట, గుమ్మడి కూడా నాటారు. మొత్తం 1 ఎకరం కూరగాయల సాగు విస్తీర్ణానికి డ్రిప్ సౌకర్యం కల్పించారు. జూన్ ప్రారంభంలోనే కంది విత్తనాలను నర్సరీ కవర్లలో నాటి నారుగా పెంచారు. ఒక నెల వయసు నారును ఇటీవల క్షేత్రంలోకి తెచ్చి నాటారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులలో చేసిన ఈ ప్రయత్నం కంది పంట నిలదొక్కుకోవడానికి తోడ్పడింది.



పెసర, మినుము పంటలను వెదజల్లే పద్ధతిలో వేశారు. ఈ రెండు పంటలూ పిందె, కాయదశలో వున్నాయి. ఆకు కూరల కోసం మడులు తయారు చేసి విత్తనాలు చల్లారు. మిరపనారు నాటేందుకు సిద్ధంగా వుంది.



### భూసార యాజమాన్యం:

క్షేత్రంలో వర్షపు నీటి సేకరణ, సంరక్షణ కోసం 50×30×4 మీటర్ల విస్తీర్ణంలో పొలం చెరువును తవ్వగా, అందులో వచ్చిన చెరువు మట్టిని పొలానికి భూసారం అందించేందుకు వినియోగించారు. ఇది గాక ఇప్పటి వరకూ 5 టన్నుల పశువుల ఎరువు, 1,200 లీటర్ల జీవామృతం భూసారం పెంపుదలకు ఉపయోగించారు. చెరువు తవ్వకంలో వచ్చిన మొరం మట్టిని అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం, భవన నిర్మాణాల కోసం వుద్దేశించిన స్థలం లెవెలింగ్ కోసం ఉపయోగించారు.

### రెయిన్ గేజ్:


క్షేత్రంలో వర్షపాతాన్ని కొలిచే పరికరాన్ని నెలకొల్పారు. రాష్ట్ర మంతా సాధారణ వర్షపాతం నమోదైనట్లు ప్రభుత్వం లెక్కలు చెబుతున్నా, ఈ క్షేత్రంలో నెల కొల్పిన రెయిన్ గేజ్ రీడింగ్ ప్రకారం జూన్ 1 నుండీ జులై 25 నాటికి ఈ ప్రాంతంలో కేవలం 30 మి.మీ. వర్షం మాత్రమే కురిసింది.


### సాగునీటి వినియోగం

క్షేత్రంలో 3 బోర్లు వున్నప్పటికీ 2 మాత్రమే కొద్దిపాటి నీటిని అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వర్షపునీటిని సంరక్షించుకునేందుకు, పంటలకు నీరు అందించేందుకు మూడు పద్ధతులలో ప్రయత్నాలు జరిగాయి. ఒకటి, క్షేత్రంలో పల్లపు ప్రాంతాన్ని ఎంచుకుని చెరువు తవ్వడం. ఈ ప్రాంతంలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల కారణంగా, ఇప్పటి వరకు చెరువులోకి నీళ్ళు రాలేదు. రెండవది, పొలంలో అక్కడక్కడా ట్రెంచ్‌లు తవ్వడం. పడిన కొద్ధిపాటి వర్షాన్ని భూమిలోకి ఇంకించేందుకు ఈ ట్రెంచ్‌లు తోడ్పడ్డాయి. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిన మండలాలలో లింగాలఘనపురం మండలం ఒకటి. ఈ నేపథ్యంలో వర్షపునీటి సంరక్షణ, బోరు బావుల రీఛార్జికి ట్రెంచ్‌లు బాగా వుపయోగ పడతాయి. అదే ఈ క్షేత్రంలో కూడా జరిగింది.

ఈ ప్రాంతంలో పడిన వర్షంతో ఎండిపోయిన చాలా బోరు బావులలోకి ఇంకా తగినంత నీరు రానప్పటికీ, ఈ క్షేత్రంలో అనుసరించిన పద్ధతుల వల్ల 2 బోర్లు కొద్ధిగానైనా నీటిని అందిస్తున్నాయి.

పంటలకు సాగునీరు అందించేందుకు చేసిన మూడవ ప్రయత్నం, 1 లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన మరో చెరువును (7×7×2 మీటర్లు) తవ్వి అందులో నీరు ఇంకి పోకుండా షీట్ వేయడం. కొద్ధిగా నీరు అందిస్తున్న 2 బోర్ల నుండీ ఈ చెరువులోకి నీరు పంప్ చేయడం. "కేంద్రీకృత సాగునీటి సరఫరా పద్ధతి" ద్వారా పొలం పొడవునా పైపు లైన్ వేసి, ప్రతి అర ఎకరానికి ఒక చోట వాల్వ్ ద్వారా చెరువు నుండి పంప్ చేసిన నీటిని ఎక్కడికక్కడ రెయిన్‌గన్ సహాయంతో (స్ప్రింక్లర్ పద్ధతిలో) పంటలకు సాగునీరు అందించడం. జులై మధ్య భాగంలో







పూర్తయిన ఈ పద్ధతిలో 5 ఎకరాలలోని పంటలకు జులై 26 నాటికి ఒక్కసారి మాత్రమే నీరు అందించినా, అన్ని పంటలకూ తగినంత తేమ అందుబాటులో వుంది. ఈ పద్ధతి వల్ల పదే, పదే బోర్లను వినియోగించాల్సిన అవసరం తగ్గిపోయింది. తక్కువ నీటితో, పంటలకు అవసరమైనంత తేమ అందించే పద్ధతిలో పంటలను కాపాడుకోవడం సాధ్యమవుతున్నది.




**పంటల సస్యరక్షణ:**

వేసిన పంటలలో మొదటగా విత్తన శుద్ధి చేశారు. పి.జి.పి.ఆర్. అంటే మొక్కల ఎదుగుదలకు సహకరించే, మొక్క వ్రేళ్ళ దగ్గర వుండే సూక్ష్మ జీవుల తోను మరియు పి.ఎస్.బి అంటే అందుబాటులో లేని భాస్వరమును మొక్కలు అందుబాటులోకి తెచ్చే ఫాస్ఫేట్ సోల్యుబిలైజింగ్ బ్యాక్టీరియాను (పొడి రూపంలో దొరుకుతుంది) బెల్లం నీళ్ళలో కలిపి విత్తన శుద్ధి చేసారు. విత్తన శుద్ధి తర్వాత విత్తనాలను నీడలో ఆరనిచ్చి అరగంట తర్వాత నాటారు.



పెసలు, మినుములు, బెండ, బీర, కాకర, ఆనప/ సొర, మొలకలు బాగా వచ్చాయి. నెలరోజులకు బెండలోను, పెసర, మినుముల్లోను **స్పోడోప్టెర ఎగ్జిగ్వా** అన్న **లద్దె పురుగు** సోకింది. చిన్న మొక్కల ఆకులను రంధ్రాలు చేయడం మొదలెట్టింది. బెండలో ఐతే మొక్క పూర్తిగా పోయేంతగా పురుగు సోకింది. ఇది చూడటానికి పచ్చపురుగు మాదిరి వుండి, మెత్తగా వుంటుంది. దీని నివారణకు బీ.టీ. (బాసిల్లస్ తురింజియెన్సిస్) అనే బ్యాక్టీరియా పొడిని లీటర్ నీటికి 1 గ్రాము చొప్పున పిచికారీ చేయడం ద్వారా ఇది మంచి నివారణని ఇచ్చింది. పురుగు ఉధృతి తగ్గింది.

బీ.టీ. పొడిని తవుడు, బెల్లం కలిపి వుండలుగా చేసి పిచికారీ చేసే ముందురోజు పురుగులకు ఎరలాగా పొలంలో అక్కడక్కడా పెట్టాం. కానీ దానిని చీమలు తిన్నాయి. కుక్క కూడా రుచి చూసింది. ఈ విధంగా మన అదుపులో లేని క్రియలవల్ల మనం చేసే పని నుండి (అంటే బి.టి. పొడి పెద్ద జంతువులలో ఏ విధమైన హాని చెయ్యదు కాబట్టి సరిపోయింది). ఏ పురుగు మందో ఐతే తిన్న కుక్కకు గాని, వేరే ప్రాణులకు గాని హాని జరుగవచ్చు కదా! తర్వాత ఎకరానికి 4 చొప్పున లింగాకర్షక ఎరలు బెండలో పెట్టాం. అందులో విపరీతంగా మగ పురుగులు పడ్డాయి.



పెసర, మినుము, బెండలలో రసం పీల్చు పురుగులు మొదలయ్యాయి. ముఖ్యంగా పేనుబంక, పచ్చదోమ, తెల్లదోమ. వీటి నివారణకు వావిలి కషాయం పిచికారీ చేసాం. అవి అదుపులోకి వచ్చాయి. అలాగే పసుపు జిగురు పళ్ళాలు కూడా అమర్చాం. బీరలో పూత, పిందె మొదలయ్యాయి. అందుకు కాయ ఈగ రాకుండా లింగాకర్షక ఎరలు పెట్టాం. అందులో కూడా పురుగులు ఎక్కువగానే పడ్డాయి.

# మీకు తెలుసా?

❖ తెలంగాణా రాష్ట్రమంతా సాధారణ వర్షపాతం నమోదైనట్లు ప్రభుత్వం గణాంకాలు ప్రకటిస్తున్నా, క్షేత్ర స్థాయిలో చాలా మండలాలలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఇంకా వున్నాయనీ, భూగర్భ జల మట్టాలు ఏ మాత్రం పెరగలేదనీ, బోర్లలో నీరు, వరి లాంటి పంటల సాగుకు అవి ఏ మాత్రం సరిపోయేవిగా లేవనీ.

❖ అన్ని రకాల పంటలకూ, పంటల బీమా పథకం క్రింద జులై 31 నాటికి బీమా ప్రీమియం చెల్లింపు గడువు ముగిసిపోతుందనీ, ఇంకా చాలా చోట్ల రైతులకు పంట రుణాలు అందలేదనీ, రుణాలలో మాత్రమే ప్రీమియం మినహాయించుకునే పద్ధతి వల్ల, లక్షలాది మంది రైతులు, పంటల బీమా పరిధిలోకి రాకుండా మిగిలి పోయారనీ.

❖ తెలంగాణా ప్రభుత్వం ఈ సంవత్సరం చెల్లించాల్సిన రుణ మాఫీ మొత్తంలో సగం మాత్రమే విడుదల చేస్తూ, జీ.వో ఇచ్చిందనీ, కానీ ఆ మొత్తం ఇంకా క్షేత్ర స్థాయిలో బ్యాంకులకు చేరలేదనీ, ఫలితంగా బ్యాంకులు రైతులకు పంట రుణాలు ఇవ్వడం లేదనీ, రుణ మాఫీ మొత్తాలు, కొన్ని బ్యాంకులకు అందినా, అవి వడ్డీ చెల్లింపులకే సరిపోతున్నాయనీ, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదనీ.

❖ ఉభయ తెలుగు రాష్ట్రాలలో కనీసం 40 లక్షల మంది వున్న కౌలు రైతులకు, గడువులోపల గుర్తింపు కార్డులు ఇవ్వలేదనీ, ఇచ్చిన గుర్తింపు కార్డుల ఆధారంగా కూడా బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదనీ, కౌలు రైతులను జె.ఎల్.జీలుగా ఏర్పరిచి పంట రుణాలు ఇవ్వాలనీ, అలా జే.ఎల్.జీలను ఏర్పరిచే బాధ్యత బ్యాంకులదేననీ, కానీ ఒక్క బ్యాంకు కూడా అటువంటి ప్రయత్నం చేయడం లేదనీ.

❖ 2015-16లో పరంపరాగత్ కృషి వికాస్ యోజన పథకం క్రింద సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు నిధులు కేటాయించిన తెలంగాణా ప్రభుత్వం కొన్ని జిల్లాలలో తిరిగి ఆ నిధులను వెనుకకు తీసుకుందనీ, ఈ సంవత్సరం ఒక్క రూపాయి కూడా ఆ పథకం క్రింద బడ్జెట్‌లో కేటాయించలేదనీ.

❖ వ్యవసాయ సబ్సిడీ పథకాల అమలు కోసం జిల్లా జేడీఏలకు, ఉద్యానశాఖ అధికారులకు విడుదల చేయాల్సిన నిధులు, నెలలు గడుస్తున్నా, ప్రభుత్వం విడుదల చేయడం లేదనీ, ఫలితంగా రైతులు చిన్న, చిన్న సబ్సిడీల కోసం పెట్టుకున్న వేలాది దరఖాస్తులు పెండింగులో వుంటున్నాయనీ, కానీ ధనవంతులు ఏర్పరుచుకునే పాలీ హౌజుల లాంటి వాటికి మాత్రం సబ్సిడీ నిధులు విడుదలవుతున్నాయనీ.

❖ వ్యవసాయ యాంత్రీకరణ క్రింద రైతుల గ్రూపులకు ట్రాక్టర్లు 50 శాతం సబ్సిడీపై ఇచ్చే ఒక పథకం వుందనీ, ఆ పథకం కోసం అప్లై చేయాలంటే స్థానిక శాసన సభ్యుల లెటరు తెచ్చుకోవాలనీ, ఆ లెటరు ఇచ్చేందుకు కొందరు శాసన సభ్యులు లక్ష రూపాయలు కమీషన్ అడుగుతున్నారనీ, అవి కట్టలేక, చాలా మంది సాధారణ రైతులు గ్రూపులు ఆ స్కీము జోలికే వెళ్ళడం లేదనీ.

❖ బలవన్మరణాలకు పాల్పడిన రైతు కుటుంబాలకు ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలూ అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నాయనీ, రాష్ట్ర హైకోర్టు ముందు తామే ఇచ్చిన అఫిడవిట్ల ప్రకారం కూడా చర్యలు తీసుకోవడం లేదనీ.

❖ విద్యుత్ బిల్లుల విషయంలో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపబోతున్నదనీ, దీనికి కారణం ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విద్యుత్ విధానమనీ.


# “భారత వ్యవసాయ సంక్షోభాన్ని అర్థం చేసుకుందాం రైతులకు అండగా నిలబడదాం” అంటూ

## ఐ 4 ఫార్మర్స్ నేతృత్వంలో అమెరికా ఎన్.ఆర్.ఐల కుటుంబాల సమ్మేళనం

వాళ్ళు, ఉద్యోగాలు వెతుక్కుంటూ విదేశాలకు తరలి వెళ్ళారు. అక్కడ, మంచి జీతాలతో సౌకర్యవంతమైన జీవితాలనే గడుపుతున్నారు. కానీ, వాళ్ళ మనసు ఇక్కడే వుంది. ముఖ్యంగా తాము పుట్టి పెరిగిన తెలుగు రాష్ట్రాలలోని గ్రామాలలోనే వుంది. ఇక్కడి భూములనూ, ఊరినీ, ఊరి ప్రజలనూ, వ్యవసాయం చేస్తున్న అమ్మా, నాన్నలనూ, అన్న దమ్ములనూ, వాళ్ళు మర్చిపోలేదు. అన్నం ఎక్కడి నుండి వస్తుందో, అర్థం చేసుకున్న 'వాళ్ళు', అన్నం పండించే అన్నదాత సంతోషంగా, క్షేమంగా వుండాలని మనసారా కోరుకుంటున్నారు.

వ్యవసాయ సంక్షోభాన్ని గురించి చదివీ, రైతు బలవన్మరణాల వార్తలు వినీ తల్లడిల్లి పోతున్నారు. ఇంకొక్క రైతు కూడా నిస్సహాయంగా నేల రాలి పోకూడదని బలంగా ఆకాంక్షిస్తున్నారు. మరణించిన రైతు కుటుంబాలు రోడ్డున పడకూడదనీ, వారి పిల్లల చదువులు ఆగిపోకూడదనీ తపన పడుతున్నారు. బాధ్యతగా స్పందిస్తున్నారు. సమీకృత మవుతున్నారు. చర్చించు కుంటున్నారు. I 4 Farmers (ఐ 4 ఫార్మర్స్) అసోసియేషన్ ఫర్ ఇండియాస్ డెవలప్‌మెంట్ (ఎ.ఐ.డి) పేరుతో వేదికలను నిర్మించుకున్నారు. వ్యవసాయ కుటుంబాల సంక్షోభ నివారణకు, రైతు బలన్మరణాల బాధిత కుటుంబాలకు అండగా క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న సుస్థిర వ్యవసాయ కేంద్రం (సి.ఎస్.ఎ.) రైతు స్వరాజ్య వేదిక లాంటి సంస్థలతో సజీవ, స్నేహ సంబంధాలను ఏర్పరుచుకుంటూ, విషయాలను అధ్యయనం చేస్తున్నారు. సంక్షోభం నుండి బయటపడేలా బాధిత కుటుంబాలకు, ఆయా కుటుంబాలలోని పిల్లల చదువుల కోసం, తమ శక్తి మేరకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు.

అమెరికాలో కొద్ది మంది వ్యక్తులతోనే ప్రారంభమైన ఈ వేదికలు, వినూత్న కార్యక్రమాలతో, తమ స్వంత








కుటుంబాల సభ్యులను, ఇతర ఎన్.ఆర్.ఐలను, భారత రైతులకు సంఘీభావంగా సమీకరిస్తున్నాయి. కుటుంబాల సమ్మేళనాలను నిర్వహిస్తూ, వ్యవసాయ సంక్షోభమూలాలను వివరిస్తున్నాయి. ఇటీవల నిర్వహించిన కుటుంబాల సమ్మేళనం చిత్రాలివి. ఏడిగ సురేష్, రణబోతు శ్రీనివాస్ ఇంకా అటువంటి అనేక మంది తెలుగు యువతీ, యువకులు ఈ కార్యక్రమాలను చురుకుగా ముందుకు తీసుకువెళుతున్నారు.

# ఆన్‌లైన్ భూమి రికార్డులు - సాగుదార్ల హక్కులు
# విశాఖలో విజయవంతమైన పబ్లిక్ హియరింగ్



రైతు స్వరాజ్యవేదిక (RSV) ఆంధ్రప్రదేశ్ విభాగం చొరవ తీసుకొని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ (APVVU), నాట్వాన్ సంఘం, ఆదివాసీ సంఘాల సమాఖ్య వంటి సంఘాల సహకారంతో ఆన్‌లైన్ భూమి రికార్డులపై రాష్ట్రస్థాయి పబ్లిక్ హియరింగును, జూలై 2న విశాఖపట్నంలో నిర్వహించింది.

ఈ పబ్లిక్ హియరింగులో శ్రీ EAS శర్మ, భారత ప్రభుత్వం మాజీ కార్యదర్శి, శ్రీ టి.గోపాలరావు శ్రీమతి ఛాయారతన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాజీ కార్యదర్శులు విశ్రాంతి IAS అధికారులు, Ch.రవి, హైకోర్టు న్యాయవాది, బి.రామకృష్ణరాజు, జాతీయ కన్వీనరు, ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక (NAPM) ప్రజా న్యాయమూర్తులుగా పాల్గొన్నారు.

ముందుగా సీదరి శ్రీను బాధిత రైతులను, జ్యూరీ సభ్యులను ఆహ్వానిస్తూ ప్రసంగించారు. తూర్పుగోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుండి 11 కేసులను రైతు స్వరాజ్య వేదిక జ్యూరీ సభ్యుల ముందు వుంచింది. కేసులకు సంబంధించిన బాధితులు ఆన్‌లైన్ భూమి రికార్డులలో తమకు జరిగిన అన్యాయాన్ని సాక్ష్యాధారాలతో వేదిక ముందు వుంచారు. భోజన విరామం అనంతరం మరో 10 కేసులను జ్యూరీ సభ్యులు విచారించారు. ప్రజావేదికలో బాధితులు ఇచ్చిన సాక్ష్యాలను చూసి సీనియరు విశ్రాంతి IAS అధికారులు ఆశ్చర్యపోయారు. ఆన్‌లైన్ భూమి రికార్డుల బాధితులలో బాగా చదువుకున్న వారి నుండి చదువు లేని వారి వరకు అన్నివర్గాల వారు వున్నట్లుగా జ్యూరీ గుర్తించింది. పబ్లిక్ హియరింగు అనంతరం శ్రీ EAS శర్మగారు స్పెషల్ చీఫ్ సెక్రటరిగార్కి వివరాలను తెలియజేస్తూ ఒక లేఖ వ్రాసారు.

**CCLAకు నివేదిక :** పబ్లిక్ హియరింగులో పాల్గొన్న న్యాయ మూర్తులు తమ ముందుకు వచ్చిన కేసుల ఆధారంగా 11 పేజీల నివేదికను రూపొందించారు. ప్రజా న్యాయ మూర్తులలో ఒకరుగా వున్న Ch.రవి, కిరణ్ విస్సా (రైతు స్వరాజ్య వేదిక) 20-07-2016న భూమి శిస్తు కమీషనరు, ఆంధ్రప్రదేశ్ గారిని కలిసి నివేదికను అందజేసారు. ఆన్‌లైన్ భూమి రికార్డులలో వున్న తప్పులను సరిచేయకుండా వాటికి చట్టబద్ధత కల్పించవద్దని వారు కమీషనరును కోరారు. అయితే కమీషనరు నుండి సానుకూల స్పందన రాలేదు. ఆన్‌లైన్ భూమి రికార్డులలో లోపాలు వున్నాయని అంగీకరిస్తూనే, లోపాలను తొలగించే వరకు నిలుపుదల చేయడానికి వారు ఆసక్తి కనబర్చలేదు.

విలేకరి - తొలకరి

# ఎలక్ట్రానిక్ భూమి రికార్డులు - వెబ్‌లేండ్ వెతలు

పి.యస్. అజయ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో - కన్వీనర్, రైతు స్వరాజ్య వేదిక

ఆంధ్రప్రదేశ్‌లో రైతులు, ఆమాటకొస్తే దేశంలోని రైతులందరూ పలు సమస్యలతో సతమతం అవుతున్నారు. గోరుచుట్టు మీద రోకటిపోటులా ఆంధ్రప్రదేశ్ రైతులకు 'వెబ్‌లేండ్' లేదా 'ఆన్‌లైన్' భూమి రికార్డులు కొత్త సమస్యలను తెచ్చిపెట్టాయి. రాష్ట్రంలోని ఏ మండల రెవెన్యూ కార్యాలయానికైనా సోమవారం వెళ్ళి కూర్చుంటే మీకు వెబ్‌లేండ్ బాధిత రైతులు కన్పిస్తారు. అసలు ఏమిటీ ఈ వెబ్‌లేండ్? ఆ పేరు వింటే రైతులెందుకు భయపడుతున్నారు? తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

**'వెబ్‌లేండ్' అంటే!**

మహా ఘనత వహించిన ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం భూమి రికార్డులను కంప్యూటర్లలో నిక్షిప్తం చేసి (ఈ పని అంతకుముందే ప్రారంభమయ్యింది) వాటిలో మార్పులు చేర్పులు చేయడానికి వీలు కల్పించే ఒక కంప్యూటరు ప్రోగ్రామ్‌కు రికార్డుల సమాచారాన్ని జత చేసింది. కంప్యూటరులోకి ఎక్కించిన ఈ రికార్డును రిజిస్ట్రేషన్, బ్యాంకులకు అనుసంధానం చేసింది. ఇంటర్‌నెట్ సౌలభ్యం వున్నచో ఈ రికార్డులను ఎవరైనా ఎక్కడి నుండైనా చూడవచ్చు, ప్రింట్ తీసుకోవచ్చు. **అయితే ఈ రికార్డులో మార్పులు చేయాలంటే ఆ భూమి ఏ మండల పరిధిలో వున్నదో ఆ మండల తాశీల్దారు మాత్రమే చేయగలడు. ప్రతి తాశీల్దారుకు ఒక డిజిటల్ తాళం చెవి (కీ) ఇవ్వబడింది. దాన్ని ఉపయోగించి తాశీల్దారు ఎలక్ట్రానిక్ భూమి రికార్డులలో మార్పులు చేయగలరు.**

meebhoomi.ap.gov.in అనే వెబ్‌సైటులోకి వెళ్లడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలకు సంబంధించిన ఏ రెవెన్యూ గ్రామ భూమి రికార్డునైనా మీరు చూడవచ్చు. భూమి రికార్డులను ఆన్‌లైన్‌లో వుంచడం ద్వారా 'పారదర్శకత'కు పెద్దపీట వేసామని ప్రభుత్వం భావిస్తున్నది.

**వెబ్‌సైట్‌లో వున్న భూమి రికార్డులు ఏమిటి?**

అసలు ఒక గ్రామానికి ఎన్ని రకాల భూమిరికార్డులు వుంటాయి! అవన్నీ వెబ్‌సైట్‌లో వున్నాయా? ప్రస్తుతం ఒక రెవెన్యూ గ్రామానికి 11 రకాల భూమి రికార్డులు వున్నాయని అంటున్నారు. అందులో ఈ క్రింది భూమి రికార్డులు వెబ్‌సైట్‌లో పెట్టినట్లుగా ప్రభుత్వం చెపుతుంది. అవేమిటో చూద్దాం.

**1-బి రికార్డు:**

ఇది పట్టాదార్ల వివరాలను తెలిపే రిజిష్టరు. ఇందులో నమోదైన వారికే పట్టాదారు పాసు పుస్తకం / టైటిల్ డీడ్ పొందే వీలు వుంటుంది.

**అడంగల్/పహాణి:**

దీనినే 3వ నెం.అడంగల్ లేక పహాణీ అంటారు. ఒక వ్యవసాయక సంవత్సరాన్ని (జూలై 1తో ప్రారంభమయ్యి జూన్ 30 తో ముగుస్తుంది) ఒక 'ఫసలీ' అంటారు. ఒక ఫసలీకి ఒక అడంగల్ వ్రాస్తారు. ఆ వ్యవసాయక సంవత్సరంలో భూముల సాగు వివరాలను ఇది నమోదు చేస్తుంది.

**ఎఫ్.ఎం.బి:**

ఇది ఒక సర్వే నెంబరుకు సంబంధించిన కొలతలను చూపిస్తుంది. ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్ (FMB) అని ఇంగ్లీషులో, పొలం కొలతల పుస్తకం అని తెలుగులో అంటారు. రెండు సర్వే నెంబర్ల మధ్య లేదా ఒక సర్వే నెంబరులోని ఉపఖండాల మధ్య భూమిపై హద్దులు నిర్ణయించాలంటే ఈ పటం తప్పనిసరిగా వుండాలి.

**గ్రామ పటం:**

దేశానికి పటం వున్నట్లుగా రెవెన్యూ గ్రామానికి గ్రామ పటం వుంటుంది. ఇది ఆ గ్రామంలో గల భూములను సర్వే నెంబర్ల వారీగా చూపిస్తుంది.

ప్రస్తుత 'వెబ్‌లేండ్'లో పై నాలుగు రికార్డులు వున్నాయి. అయితే కొన్ని గ్రామాలు లేదా కొన్ని సర్వే నెంబర్లకు పైన తెల్పిన 3, 4 రికార్డులు లేవు. కానీ అన్ని గ్రామాలకు సంబంధించిన మొదటి, రెండవ రికార్డులు మాత్రం వున్నాయి.

**బాగానే వుంది కదా!? పేచి ఏమిటి?**

వెబ్‌లేండ్‌లో వున్న సమాచారాన్ని కేవలం ఒక సమాచారంగానే గాకుండా అందులో వున్న 'సమాచారానికి' చట్టబద్ధత, న్యాయబద్ధత కల్పించి ఋణాలు, ఆస్తుల బదలాయింపు, హక్కుల నిర్ధారణ (కోర్టులు)కు సాధికారిత కల్పించడంతో సమస్య ఉత్పన్నమయ్యింది. తాశీల్దారు కార్యాలయంలో వున్న హార్డు కాపీ భూమి రికార్డుకు, కంప్యూటరులో నమోదు చేసి వెబ్‌లేండ్‌లో పెట్టిన సాఫ్ట్ కాపీ సమాచారానికీ తేడా వుంటే ఏది చెల్లుతుంది? దేనిని అనుసరించాలన్నది ఇప్పుడు సమస్య.

రైతుల చేతిలో వున్న భూమి రికార్డులు రెండు, అవి 1. పట్టాదారు పాసు పుస్తకం (PPB), 2. టైటిల్ డీడ్ (T.D) (ఇక నుండి PPB/TD) మొదటిది తాశీల్దారు, రెండవది తాశీల్దారు, RDOలు సంతకాలు పెట్టి రాజముద్ర వేసి రైతులకు ఇచ్చినవి. ఇందులో వున్న సమాచారానికీ వెబ్‌లేండ్‌లో వున్న సమాచారానికీ తేడా వస్తే దేనిని పరిగణనలోకి తీసుకోవాలి?

సమస్య సులువుగా అర్ధం అవ్వడానికి రెండు ఉదాహరణలు చూద్దాం.

రామయ్య ఈ సంవత్సరం కూడా యధావిధిగా వ్యవసాయ ఋణం కోసం బ్యాంకుకు PPB/TDలతో వెళ్ళాడు. అతను 5 ఎకరాల రైతు. బ్రాంచి మేనేజరు ఆన్‌లైన్‌లో వెబ్‌లేండ్ తెరచి అతనికి 3 ఎకరాలే వుందని, కనుక ఆ ప్రాప్తికి ఋణం ఇస్తానని అన్నాడు. రామయ్య భూమిని అమ్మలేదు, తనఖా పెట్టలేదు మరి 2 ఎకరాలు ఏమయ్యింది. ప్రభుత్వమే ఇచ్చిన PPB/TDలకు, అందులో వున్న సమాచారానికి విలువ ఏది?

సోమయ్య కుమార్తె పెళ్ళికోసం తనకున్న 4 ఎకరాలలో ఒక ఎకరా అమ్మకం పెట్టి డబ్బు తీసుకున్నాడు, పెళ్ళి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అన్నీ సిద్ధం చేసుకొని సబ్‌రిజిస్ట్రారు ఆఫీసుకు PPB/TDలతో వెళ్తే 'వెబ్‌లేండ్'లో అతని భూమి చూపించడం లేదని కనుక రిజిస్ట్రేషన్ అవ్వదని వెనక్కి పంపించేసారు.

రామయ్య, సోమయ్యలు లబోదిబోమంటూ తాశీల్దారును కలిస్తే మీసేవా కేంద్రంకు వెళ్ళి 'విచారణ కోసం' చలాన కట్టమని సలహా ఇచ్చాడు తాశీల్దారు.

తాశీల్దారు కార్యాలయంలోనూ, రైతుల చేతిలో వున్న పాసు పుస్తకాలలోనూ వుండే సమాచారం వెబ్‌లేండ్‌లో లేకపోతే అందుకు బాధ్యులు ఎవరు? రైతులు చలాన ఎందుకు కట్టాలి? చలానా కట్టినా పని జరగదు. VRO నుండి తాశీల్దారు వరకు వేలకు వేలు లంచాలు ఇవ్వాలి. రోజులు తరబడి రెవెన్యూ అధికారులు చుట్టూ తిరగాలి.

**పాత పద్ధతి ఏమిటి?**

ఒక్క నిముషం వెబ్‌లేండ్ గూర్చి మర్చిపోదాం. ఒక రైతుకు PPB/TD ఇవ్వాలంటే వున్న పద్ధతి ఏమిటి? ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కులు మరియు పట్టాదారు పాసు పుస్తకాల చట్టం భూమి హక్కులు, రికార్డుల నిర్వహణను గూర్చి చెపుతుంది. ఈ చట్టం 1971లో రాగా 1980, 1989, 1994, 2001లలో దీనికి సవరణలు వచ్చాయి. తాజాగా ప్రస్తుత తెలుగుదేశ ప్రభుత్వం 2016లో మరికొన్ని సవరణలు చేసింది. 1989లో ఈ చట్టానికి సమగ్రమైన నియమాలను రూపొందించారు. 1990 నుండి ఈ చట్టం పూర్తిస్థాయిలో అమలౌతుందని చెప్పవచ్చు.

ఈ చట్టం ప్రకారం విచారణ చేసి ఒక రైతుకు PPB/TDలు ఇస్తే అందులో వున్న సమాచారం తప్పని 'అప్పీల్ కోర్టు' నిర్ధారించే వరకు వాటినే ప్రామాణిక పత్రాలుగా భావించాలని చట్టం చెపుతుంది. అప్పటికే వున్న రికార్డులో ఒక మార్పు చేయాలంటే అందుకు పాటించవలసిన పద్ధతిని విపులంగా చట్టం, నియమాలు చెప్పాయి. ఒక చట్టం ద్వారా ఇవ్వబడిన రామయ్య, సోమయ్య భూమి హక్కు పత్రాలు 'వెబ్‌లేండ్' అనే సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాం వలన ఎలా రద్దయి పోయాయి! బ్యాంకు, రిజిస్ట్రేషన్ ఆఫీసు, కోర్టులలో అవి లీగల్ డాక్యుమెంట్లుగా తమ ఉనికిని ఎలా కోల్పోయాయి? ఈ ప్రశ్నలు వినడానికి ప్రభుత్వ సిద్ధంగా లేదు.

**అసలు ఏం జరిగింది?**

పదుల సంవత్సరాలుగా సాగుతున్న పాత పద్ధతుల నుండి కొత్తదనం వైపు మారకూడదా? సాంకేతిక ప్రక్రియలను సృజనాత్మకంగా వాడుకోకూడదా? భూమి రికార్డులను రహస్యంగా వుంచిన కాలం నుండి బాహాటంగా అందరిముందు వుంచడం ముందడుగే కదా! అది తప్పక ముందడుగే. అయితే అన్ని కోణాలలో లోతుగా పరిశీలించుకొని, దీర్ఘకాల దృష్టితో చేయవలసిన పనులను హడావిడిగా, తాత్కాలిక, ప్రచార ఆర్భాటాల కోసం చేయడం వలన మొదటికే మోసం వస్తుంది.

భూమి రికార్డులలో వుండే సమాచారం ప్రజల జీవితాలకు, ఆస్తులకు సంబంధించినది. ఈ రికార్డులలోని సమాచారాన్ని కంప్యూటర్లకు ఎక్కించే బాధ్యతను ఆయా గ్రామాల VROలకు వప్పగించారు. ఒక ఎంట్రీకి 0.25 పైసలు చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పింది. అనేకచోట్ల వున్నతాధికారులు ఆ నిధులు కైంకర్యం చేసారు. ప్రైవేటు కంప్యూటరు సెంటర్ల వద్ద VROలు ఈ రికార్డులు వప్పగించి, 'మమ' అనిపించారు. అలా కంప్యూటర్లకు ఎక్కించిన సమాచారాన్ని గ్రామాల వారీగా రాత రికార్డులతో సరిపోల్చకుండా, దాన్ని వెబ్‌సైట్‌లో పెట్టి సాధికారిత కల్పించారు. ఇది సమస్యకు మూలం.

భూమి రికార్డులను రెవెన్యూశాఖ నిర్వహిస్తుందే గానీ రూపొందించదు. ఆ పనిచేసే నిపుణురాలు " సర్వే సెటిల్‌మెంట్ మరియు భూమి రికార్డుల శాఖ'. ఈ శాఖ ప్రమేయం లేకుండా భూమి రికార్డుల కంప్యూటరు ప్రోగ్రాంను తయారు చేసారు. కేవలం సాఫ్ట్‌వేర్ తెలిస్తే సరిపోదు. భూముల గురించి, రికార్డుల గురించి, భూమి చట్టాల గురించి తెలిసి వుండాలి.

ప్రస్తుత ప్రభుత్వం భూమి రికార్డుల చట్టానికి సవరణ తెచ్చిందని ముందు ప్రస్తావించుకున్నాం. సర్వే, సెటిల్‌మెంట్స్ మరియు భూమి రికార్డుల శాఖ బాధ్యతల నుండి భూమి రికార్డుల నిర్వహణ తప్పించడం ఈ సవరణలలో ఒకటి.

**రికార్డులను మార్చెయ్యడం సులువయ్యింది!**

మండల రెవెన్యూ కార్యాలయంలో వున్న హార్డు కాపీ (రాసిన రికార్డు) ను ఎవరైనా మారిస్తే అది తెలిసిపోతుంది. కానీ కంప్యూటరులో వున్న సాఫ్ట్ కాపీలు మార్చడం చిటికలో పని. రైతు పాసు పుస్తకంలో మార్పు చేయాలంటే అతన్ని / ఆమెను కార్యాలయానికి పిలిపించాలి, అది తెలిసిపోతుంది. కానీ ఆన్‌లైన్ 1-బిలో విస్తీర్ణం తగ్గించేయవచ్చు, పెంచవచ్చు లేదా తీసేయవచ్చు. రైతు పాస్ బుక్కును ముట్టుకోనవసరం లేదు. రిజిస్ట్రేషన్, బ్యాంకు కార్యాలయాలకు ఇప్పుడు పాసు పుస్తకాలతో పనిలేదు.

రాష్ట్రంలోని మండల రెవెన్యూ కార్యాలయాలకు "ఔట్ సోర్సింగ్" క్రింద కంప్యూటర్ ఆపరేటర్లను ఇచ్చారు. వీరికి ఇచ్చేది కనీస వేతనాల కంటే తక్కువ జీతాలు. చాలామంది తాశీల్దార్లకు కంప్యూటరు పరిజ్ఞానం శూన్యం. మనుష్యులు వినియోగదార్లుగా మారిపోయిన నేటి కాలంలో డబ్బు అవసరాలు బాగా పెరిగిపోయాయి. దాంతో వెబ్‌లేండ్‌లో డిజిటల్ కీ' వుపయోగించి రికార్డులు మార్చివేయగలిగే వెసులుబాటు డబ్బు సంపాదనకు రాచమార్గంగా మారింది. లేండ్ మాఫియా, పొలిటికల్ మాఫియా, 'రెవెన్యూను' మాఫియాగా మార్చేసాయి.

ఎలాంటి నోటీసు, విచారణ, భయం లేకుండా రాత్రికి రాత్రి వెబ్‌లేండ్‌లో డేటా మార్చేసి రిజిస్ట్రేషన్‌లు చేస్తున్న కేసులు, సర్వే నెంబర్లు, విస్తీర్ణాలు, పేర్లు, భూమి వర్గీకరణలు మార్చేసి డబ్బు గుంజుతున్న దృష్టాంతాలు వేల సంఖ్యలో బయటకు వస్తున్నాయి. ఎవరు, ఎందుకు, ఎప్పుడు తమ రికార్డును మార్చేసారో రామయ్య, సోమయ్య వంటి రైతులకు తెలిసే అవకాశమే లేదు.

**చట్టానికి తాజా సవరణ :**

భూమి హక్కులు మరియు పట్టాదారు పాసు పుస్తకాల చట్టంకు ప్రభుత్వం ఈ సంవత్సరం (2016 లో) సవరణ తెచ్చింది. దాన్ని ఆసరాగా చేసుకొని 1989 నియమాలకు సవరణలను ప్రతిపాదిస్తూ 18-06-2016న తన వెబ్‌సైట్‌లో ముసాయిదా సవరణలను ఇంగ్లీషులో పెట్టి 12 రోజులలో ప్రజలను అభిప్రాయాలు చెప్పమంది. 01-07-2016న GOMS No. 271 ద్వారా 1989 నియమాలకు సవరణలను నోటిఫై చేసింది.

ఇందులో మొత్తం 9 సవరణలు వున్నాయి. పట్టాదారు పాసు పుస్తకం, టైటిల్ డీడ్‌గా వున్న రెండు విడివిడి పుస్తకాలను కలిపి ఒకే పుస్తకంగా తేవడంతోబాటు వెబ్‌లేండ్‌లో వున్న సమాచారం ఆధారంగా రిజిస్ట్రేషను శాఖ ఆస్తి బదలాయింపులు, బ్యాంకులు ఋణాలు ఇవ్వవచ్చని చెప్పింది. వీరెవరూ ఇక రైతులను పాస్ పుస్తకాలు తెమ్మని అడగకూడదు.

ఎలక్ట్రానిక్ రూపంలో వున్న సమాచారానికే చట్టబద్ధత, న్యాయబద్ధత, సాధికారత కల్పించడం ఈ సవరణల ఉద్దేశ్యం. నిజానికి ఈ ఉత్తర్వులు, చట్ట సవరణకు ముందే ప్రభుత్వం ఆ పని మొదలుపెట్టింది. ఇప్పుడు చట్టబద్ధత కల్పించింది.

**కోనేరు కమిటీ ఏం చెప్పింది?**

ఈ వ్యాసాన్ని ముగించే ముందు భూమి రికార్డుల విషయమై కోనేరు రంగారావు కమిటీ ఏం చెప్పిందో జ్ఞాపకం చేసుకోవడం ఉచితంగా వుంటుంది.

మన రాష్ట్రంలో ప్రాథమిక భూమి రికార్డులు తయారయ్యి 50 నుండి 60 సం॥రాలు గడిచిపోయింది. అనేకచోట్ల ఇవి గల్లంతయ్యాయి. లేదా చినిగిపోయాయి. రికార్డులలో సమాచారానికీ భూముల మీద వాస్తవ హక్కులు, అనుభవానికీ మధ్య తేడా పెరగిపోయింది. ప్రభుత్వాలు గ్రామ రెవెన్యూ వ్యవస్థపై చేస్తూ వచ్చిన ప్రయోగాలు, రెవెన్యూ శాఖలపై చూపిస్తూ వచ్చిన అలక్ష్యం వలన భూమి రికార్డుల నిర్వహణ, యాజమాన్యం పూర్తిగా దెబ్బతిన్నదని కమిటీ గుర్తించింది. కనుక భూమి రికార్డులను వాస్తవ పరిస్థితికి అద్దంపట్టే విధంగా తాజాపర్చాలని, ఇందుకు సమగ్ర సర్వే, సెటిల్‌మెంట్ నిర్వహించాలనే సూచనలు చేసింది. వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది కూడా. ఇప్పటికే వున్న భూమి రికార్డులలో వున్న లోపాలను సరిచేయకుండా, వీటిలో వున్న సమాచారాన్ని తప్పులతడకగా కంప్యూటర్లలోకి ఎక్కించి, వాటిని ఎలాపడితే అలా మార్చివేసే వెసులుబాటు కల్పించిన ప్రభుత్వం అలాంటి సమాచారానికే చట్టబద్ధత కూడా ఇవ్వడం రైతుల పట్ల, వ్యవసాయంపట్ల వారికున్న చులకన భావనకు నిలువెత్తు సాక్ష్యం.

భూమిని 'అమ్మే', 'కొనే' సరుకుగా తప్ప ఒక జీవనాధారంగా పాలకులు చూడలేకపోతున్నారు. 'కొని-అమ్మే' రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, వ్యవసాయం చేయకుండా భూమిని 'ఆస్తి'గా పెట్టుకున్న వారి కోసమే 'వెబ్‌లేండ్'. గ్రామ పంచాయితీలలో భూమి రికార్డుల నఖళ్లను ఉంచలేకపోయిన ప్రభుత్వం వ్యవసాయం నుండి బయటకు వెళ్ళిపోయిన NRIలు, వ్యాపారులు, బ్రోకర్లకు మాత్రం వాటిని వెబ్‌లాండ్ ద్వారా అందుబాటులోకి తెచ్చింది.

**భూమి హక్కులు - పట్టాదారు పాసుపుస్తకాల నియమాల సవరణ జి.ఒ. 271, ఏం చెపుతున్నది.**

భూమి హక్కులు - పట్టాదారు పాసు పుస్తకాల చట్టానికి ప్రభుత్వం 1989లో సమగ్రమైన నియమాలను రూపొందించింది. ఈ సంవత్సరం ఈ చట్టానికి సవరణ చట్టాన్ని ఆమోదింపచేసిన ప్రభుత్వం దానికి అనుగుణంగా 1989 నియమాలను సవరిస్తూ జి.ఒ.ఎమ్.ఎస్.నెం. 271, తేది 1-7-2016న ఆమోదించింది.

ప్రజల అభిప్రాయం కోరుతూ ముసాయిదా సవరణ నియమాలను తేది 18-6-2016న ప్రభుత్వం వెబ్‌సైట్‌లో ఇంగ్లీషులో వుంచి 12రోజులు గడువు తరువాత దానినే నోటిఫై చేస్తూ తేది 1-7-2016న జి.ఒ.నెం. 271గా ప్రకటించింది.

ఈ సవరణ నియమాల ద్వారా కొన్ని కీలకమైన మార్పులు జరుగనున్నాయి. కనుక ప్రభుత్వం తెచ్చిన సవరణలు, వాటి ప్రభావాలను గూర్చి తప్పక తెలుసుకోవాలి. 1989 నియమాలకు జి.ఒ.ఎమ్.యస్.నుం. 271 ద్వారా మొత్తం 9 సవరణలు తెచ్చింది. ఆ వరుస క్రమంలో అవేమిటో చూద్దాం.

**1వ సవరణ (రూల్ 2లో (డి))**

1989 నియమాలు 2, క్లాజ్ (డి)లో 'తెలంగాణ ప్రాంతం' అని వున్న ప్రస్తావనను తీసేసింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అయినందున ఇక అది అవసరం లేదు.

**2వ సవరణ (రూల్ 3)**

ప్రతి రెవెన్యూ గ్రామానికి భూమి హక్కుల రికార్డును ఫారం నెం.1లో తయారు చేస్తారు. ఇందులో 24 కాలమ్స్ వుంటాయి. అయితే ఈ 2వ సవరణ ఏం చెపుతుందంటే, భూమి హక్కుల రికార్డును ప్రాథమికంగా ఫారం-1లో తయారు చేసినప్పటికీ, దాని అనంతరం ఫారం 1-బి రూపంలో హక్కులు రికార్డు వుంటుంది. 1-బి రికార్డులో 14 కాలమ్స్ వుంటాయిన ఇక నుండి ఫారం -1లో రికార్డు నమోదు చేయనవసరం లేదని దీని అర్థం.

**3వ సవరణ (రూల్ 18, సబ్‌రూల్ (2)లో (1))**

ఒక భూమిపై హక్కును పొందిన వ్యక్తి ఆవిషయాన్ని ఫారం VI-A మీ సేవా కేంద్రం ద్వారాగాని లేదా ఆన్‌లైన్ (ఈ సౌకర్యం ఎప్పుడు అందుబాటులోకి వస్తే అప్పటి నుండి) తాశీల్దారుకు తెలియజేయాలి.

దీని అర్థం ఏమిటంటే నేరుగా తాశీల్దారును కలిసి ధరఖాస్తు ఇవ్వడంగాక, తప్పనిసరిగా మీ-సేవాలో చలాన కట్టి మాత్రమే అర్జిదారు తన ధరఖాస్తును (మీసేవా ద్వారా) తాశీల్దారుకు పంపాలి.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ జరిగిన వారం రోజులలోగా ఆ సమాచారాన్ని సబ్‌రిజిస్ట్రారు ఫారం VI-B ద్వారా తాశీల్దారుకు పంపించవలసి వుంటుంది. అయితే ఈ సవరణ ప్రకారం సబ్‌రిజిస్ట్రారు తనవద్ద నున్న సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా తాశీల్దారుకు పంపించవచ్చు.

భూ యజమాన్య హక్కులకు సంబంధించిన తన వద్దకు వచ్చిన సమాచారాన్ని V.R.O. ఫారం VD ద్వారా తాశీల్దారుకు తెలియపర్చాలి.

**4వ సవరణ** (రూల్ 18, సబ్ సెక్షన్ (3), (సి))

భూమి హక్కులు మార్పిడికి సంబంధించిన అభ్యర్థన రాగానే ముందుగా ముసాయిదా సవరణ 1-Bని ఎలక్ట్రానిక్‌గా తయారు చేస్తారు. దీనిపై అభ్యంతరాలను కోరుతూ ఇచ్చే ఫారం VIII లోకి అనుబంధంగా ఈ ముసాయిదా సవరణ 1Bని జతపరుస్తారు. నిర్దేశించిన గడువు లోపల ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకపోతే ఈ ముసాయిదా 1B తనంతటతానే శాశ్వత రికార్డుగా నమోదైపోతుంది.

ఒకవేళ ముసాయిదా సవరణ 1-బికి భిన్నంగా అధికారి ఉత్తర్వు ఇస్తే, ఆ ప్రకారం ఎలక్ట్రానిక్ హక్కుల రికార్డును సరిచేయాలి. సాధారణంగా అభ్యంతరాలు చెప్పడానికి ప్రజలకు

## మనం కోరుతున్నదేమిటి?

- ❖ వెబ్‌లేండ్‌లో వున్న సమాచారానికి చట్టబద్ధత, సాధికారిత కల్పించే ముందు వాటిని వాస్తవ భూమి రికార్డులతో సరిపోల్చి, సరిచేయాలి. అప్పటి వరకు వాటికి చట్టబద్ధత, సాధికారత కల్పించకూడదు.
- ❖ భూమి చట్టాలకు అనుగుణంగా వెబ్‌లేండ్ ప్రోగ్రాంలో సమూలమైన మార్పులు తేవాలి.
- ❖ వెబ్‌లేండ్ రికార్డులో ఏ అధికారి, ఎలాంటి మార్పు చేసినా అట్టి మార్పుల సమాచారం కూడా బహిరంగంగా అందరికీ కన్పించాలి.
- ❖ భూ యజమానులు, సాగుదార్లు, కౌలుదార్లు, భూమిపై ఆసక్తి వున్న వారందరికీ నోటీసు, సమాచారం ఇవ్వకుండా చేసే ఏ మార్పును పరిగణనలోకి తీసుకోకూడదు.
- ❖ రైతుల వద్ద వున్న పాసుపుస్తకాలు, టైటిల్‌డీడ్స్ వుపయోగితలను రద్దుచేసే, నిలుపుదల చేసే, సవరించే చర్యలన్నింటినీ నిలిపివేయాలి. భూముల సమగ్ర రీ-సర్వే సెటిల్‌మెంట్ నిర్వహించి కొత్తభూమి రికార్డులను రూపొందించాలి.
- ❖ గ్రామ పంచాయితీ స్థాయిలో భూమి రికార్డుల నఖళ్లను వుంచి, రైతులు వాటిని చూసుకునే అవకాశం ఇవ్వాలి.

సమాచారం ఇవ్వరు. కనుక ముసాయిదా 1-బిఎ శాశ్వత 1-బిగా, పట్టా హక్కుగా మారే అవకాశం వుంది.

**5వ సవరణ (రూల్ 19, సబ్‌క్లాజ్ (1))**

భూమి రికార్డులలో మార్పులు, చేర్పులపై అభ్యంతరాలను కోరుతూ ఇచ్చే ఫారం 8ని, ముసాయిదా 1-Bలను ఎలక్ట్రానిక్ రూపంలో తయారుచేయవచ్చు. నమూనా 1-Bని రూపొందించే సందర్భంలో ఈ సవరణ G.O.కు అనుబంధంగా ఇచ్చిన విధంగా తాత్కాలిక సబ్-డివిజన్ నెంబర్లను ఇవ్వవచ్చును.

**6వ సవరణ (రూల్ 26)**

పట్టాదారు పాసుపుస్తకం మరియు టైటిల్‌డీడ్ ఇక నుండి పట్టాదారు పాసు పుస్తకంతో టైటిల్‌డీడ్‌గా మారుతుంది. అంటే ఇక నుండి రెండు పుస్తకాలను బదులు ఒకే పుస్తకంగా వుంటుంది.

పాసు పుస్తకంతో కూడిన టైటిల్‌డీడ్ ఆధారంగా ఆస్తి అమ్మకాలు చేసుకోవచ్చును.

టైటిల్‌డీడ్‌తో కూడిన పట్టాదారు పాసుపుస్తకం తీసుకొని తీరాలనే ఆంక్షలేదు. అది హక్కుదారు ఇష్టం. ఆస్తుల లావాదేవిలు రిజిస్ట్రేషన్ చేసే సమయంలో, ఋణాలు మంజూరు చేసేటప్పుడు

పాసు పుస్తకం తప్పనిసరిగా తేవాలని అడగకూడదు. ఇకనుండి రిజిస్ట్రేషన్ శాఖ, బ్యాంకులు ఆన్‌లైన్ సమాచారంపై ఆధారపడి వ్యవహారాలను నిర్వహించాలి.

**7వ సవరణ (రూల్ 27) :**

తెల్లకాగితంపై జరిగిన అమ్మకాలు, నోటిమాట ద్వారా జరిగిన అమ్మకాలపై కోర్టులు హక్కులను నిర్ధారిస్తూ తీర్పు ఇస్తే, ఆ తీర్పు ఆధారంగా పాసు పుస్తకం కోరినప్పుడు అప్పటికి ఆ ఆస్తికి వున్న మార్కెట్ ధర లేదా స్టాంప్ డ్యూటీలలో ఏది ఎక్కువ వుంటే దాని ప్రకారం నగదు వసూలు చేసి పాసుపుస్తకం ఇవ్వాలి. ఒకవేళ కోర్టులో స్టేంపు డ్యూటీ చెల్లించి, ఆ రశీదును దాఖలు చేస్తే రిజిస్ట్రేషన్ ఫీజు మాత్రమే స్వీకరించి పాసు పుస్తకం ఇవ్వాలి.

**8వ సవరణ :**

డూప్లికేట్ పాసుపుస్తకం పొందుట గూర్చి

**9వ సవరణ :**

" సర్వే, సెటిల్‌మెంట్స్ మరియు లేండ్ రికార్డ్సు" అనే వాక్యం తొలగింపు.

**సవరణ నియమాల ఉద్దేశ్యం :**

పైన ప్రస్తావించిన సవరణలను పరిశీలిస్తే, ఎలక్ట్రానిక్ భూమి రికార్డులకు చట్టబద్ధ కల్పించడం, భూమిపై సబ్ డివిజన్ పనితో సంబంధం లేకుండా నోషనల్ (తాత్కాలిక) సబ్ డివిజన్ నెంబర్లతో పాసు పుస్తకాలు ఇవ్వడం ప్రభుత్వం ఉద్దేశ్యంగా కన్పిస్తుంది.

# వెబ్‌లేండ్ (చిత్ర) విచిత్రాలు

'వెబ్‌లేండ్' పేరుతో కంప్యూటరీకరించిన భూమి రికార్డులు రైతులకు, ముఖ్యంగా దళిత, ఆదివాసీ, పేదరైతులకు శాపంగా మారాయి. మండల రెవెన్యూ కార్యాలయంలోని కంప్యూటరు ముందు కూర్చొని, 'డిజిటల్ కీ' ద్వారా క్షణాలలో రికార్డులను తారుమారు చేయడం ఇప్పుడు సులువయ్యింది. ఆన్‌లైన్ రికార్డులోని తప్పులను సరి చేసుకోవాలంటే బాధిత రైతు ఈ-సేవా కేంద్రంలో ఛలాన కట్టాలి. ఆనక వి.ఆర్.ఒ. నుండి తాశీల్దారు వరకు ముడుపులు చెల్లించుకోవాలి. 'ప్యాకేజీ' క్రింద పనులు చేసి పెట్టే దళారీలు ఇప్పుడు తయారయ్యారు. వారు క్షణాల్లో మీ భూముల విస్తీర్ణం పెంచగలరు లేదా తగ్గించగలరు. ఇప్పుడు మనం కొన్ని కేసులు చూద్దాం.

విశాఖపట్నం జిల్లా, రావికమతం మండలం, చీమలపాడు అను కళ్యాణలోవ రెవెన్యూ గ్రామంలో దూకులంపాడు అనే శివారు గ్రామం వుంది. ఇక్కడ గదబ తెగకు చెందిన ఆదివాసీలు జీవిస్తున్నారు.వీరిని ప్రభుత్వం ఆదిమ తెగలు (పి.వి.టి.జి.)గ గుర్తించింది. చీమలపాడు రెవెన్యూ సర్వే నెం. 153/4లో ఈదల జోగి తండ్రి సోమన్న పేరున 14 ఎకరాల మెట్టు భూమి వుంది. ఈ భూమికి ప్రస్తుతం ఇద్దరు మహిళలు వారసులుగా వున్నారు. వారికి చదువులేదు. ఆన్‌లైన్ తతంగా గూర్చి తెలీదు. కొందరు బ్రోకర్లు రెవెన్యూ అధికారులతో చేతులు కలిపారు. ఈదల జోగిని ఈదల జోగిరాజని, తండ్రిపేరు సోమన్నను పైడయ్యగా ఆన్‌లైన్‌లో మార్చేసారు. ఈదల జోగిరాజు, తండ్రి పైడయ్య అనే వ్యక్తి దూకులంపాడులో వుంటున్నాడు. అతన్ని భూమిలేని పేదవానిగా గుర్తించి ప్రభుత్వం డి-పట్టా మంజూరు చేసి వుంది. ఈదల జోగిరాజు అతని కుమారులకు కొంత నగదు ఆశ చూపించి చోడవరం సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో 11 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించేసారు. రిజిస్ట్రేషన్ అయిన వెంటనే తాశీల్దారు కొన్నవారి పేర్లను ఆన్‌లైన్ 1-బిలో, అడంగళ్‌లోకి తెచ్చేసాడు. దాంతో వారు పట్టాదార్లయిపోగా నిజమైన హక్కుదార్లు భూమిలేని పేదలైపోయారు.

రూర్కి స్టీల్‌ప్లాంట్‌లో డిప్యూటీ మేనేజరుగా పనిచేసి పదవీ విరమణ చేసిన సూర్యనారాయణగారు పరవాడ మండలం తాడి గ్రామంలో 20 ఏళ్ళ క్రిందట 48 సెంట్లు కొనుక్కొన్నారు. అందులో ఒక ఇల్లు కట్టుకొని జీవిస్తున్నారు. మిగిలింది ఖాళీగా వుంది. ఇది ఎన్‌హెచ్-5 జాతీయ రహదారి ప్రక్కన వుంది. రోడ్డు విస్తరణ, పారిశ్రామీకరణ కారణంగా ఒక్కడ స్థలాల రేట్లు బాగా పెరిగాయి. ఆన్‌లైన్ 1-బి రికార్డులో 12 సెంట్లు విస్తీర్ణం తక్కువ చూపిస్తుంది. ఇదే విషయాన్ని ఆయన పరవాడ మండలం తాశీల్దారుకు ఫిర్యాదు చేసారు. 20,000 రూ॥లు లంచం ఇస్తే రికార్డు సరిచేస్తామని మధ్యవర్తులు సూర్యనారాయణకు చెప్పారు. అందుకు ఆయన నిరాకరించడంతో ఇప్పటికీ అలాగే వుంది. ఈ 12 సెంట్లు మార్కెట్ విలువ 50 లక్షల వరకు వున్నప్పుడు 20 వేలు ఎందుకివ్వరని రెవెన్యూ అధికారులు తనను ప్రశ్నిస్తున్నారని ఆయన వాపోతున్నారు.

విశాఖజిల్లా, నక్కపల్లి మండలంలో వేంపాడు అనే గ్రామం వుంది. పెట్రో కెమికల్ (పి.సి.పి.ఐ.ఆర్.) కారిడారు కోసం ఈ గ్రామాలలో భూసేకరణ జరుగుతుంది. స్థానిక అధికార పార్టీ నాయకులు, రెవెన్యూ అధికారులు కలిసి అదే గ్రామంలోని కొండ పోరంబోకు భూములకు డి-పట్టాలు ఇచ్చినట్లుగా ఆన్‌లైన్ 1బిలో కొన్ని పేర్లను ఎక్కించారు. డి-పట్టా భూమికి ఎకరాకి 12 లక్షలు వరకు నష్టపరిహారం వచ్చే అవకాశం వుంది. ఈవిధంగా సుమారు 12 కోట్లు కొట్టేయడానికి పక్కా ప్రణాళిక రూపొందించారు.

## అక్రమ భూ సేకరణకు, ముంపుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న 'మల్లన్న సాగర్' బాధిత ప్రజలు



R&D/HSE/995/2016-2018 August-2016 Published on 28-07-2016 Posted on 30-07-2016



PRINTED, PUBLISHED and OWNED BY M.LEELA PRASAD, PRINTED AT M/S NAVYA PRINTERS, RAJBHAVAN ROAD, SOMAJIGUDA, HYDERABAD, PUBLISHED AT 16-11-741/1/A/3, MOOSARAM BAGH, HYDERABAD-500 036. EDITOR : Dr. G.V. RAMANJANEYULU

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | KLVA102M277 |
| పుస్తకం పేరు | తొంకరి |
| తారీఖు | 07 February 2025 |
| ముందు అట్ట | Yes |
| వెనుక అట్ట | Yes |
| మొత్తం పేజీలు | 41 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | NO |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Sk. Sharmila |
| పేజీలు విడదీసినది | Sk. Sharmila |
| స్కాన్ చేసినది | APSO7 |
| పరీక్ష చేసినది | HEMA |
| పేజీలు పరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | Good |